టాప్ న్యూస్



## నా హృదయం ముక్కలైంది..

- కర్నూలు బస్సు ప్రమాదంపై రష్మిక ఎమోషనల్

08



## ఏదో ఒకరోజు

- అమెరికా దేశాధ్యక్షురాలిని అవుతా
- కమలా హారిస్ ఆశాభావం

02



## త్వరలో అంగన్వాడీల్లో 14 వేల ఉద్యోగాలు

- మంత్రి సీతక్క శుభవార్త
- గ్రేడ్ వన్ సూపర్ వైజర్లకు నియామక పత్రాలు అందజేత

02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

26-10-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 320 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## ఈ దారుణానికి బాధ్యులెవరు?

ప్రజా రవాణా ప్రైవేట్ చేతుల్లోకి వెళ్ళాక.. బస్సెక్కాక గమ్యస్థానం చేరుతామో లేదోనన్న భయానక పరిస్థితులు నెలకొన్నాయి. లాభాల కోసం శవపేటికలు నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రజల ప్రాణాలు హరీమనిపిస్తున్నాయి. ఫిట్ నెస్ ముగిసి.. 16 చలాన్లు ఉన్నా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ వీధుల్లో దర్జాగా తిరిగిందంటే కళ్ళకు గంతలు కట్టుకున్న అధికారుల తీరు కళ్ళకు కడుతుంది. రవాణా రంగంలో పెరుగుతున్న నిర్లక్ష్యం, అధికారుల మౌనం, ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డగోలు దందా — ఇవన్నీ కలిసి యమపాశాల్లా మారుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులు, శిక్షణ లేని డ్రైవర్లు, నిర్లక్ష్యపు తనిఖీలు... చివరికి బలవన్మరణాలే ఫలితమా? ప్రజా రవాణా రంగం ఎవరి చేతుల్లో నడుస్తోంది? ఈ వ్యవస్థలోని మాఫియా గుట్టు ఎప్పుడు విప్పబడుతుంది? ప్రభుత్వం ఈ రవాణారంగాన్ని నిర్వహించలేదా? ఇంకెన్ని ప్రాణాలు పోవాలి? సంతాపపు ప్రకటనలు.. సంఘటన జరిగిన తర్వాత జరిగే మొక్కుబడి తనిఖీలతోనే సరా? ఇవి ఆగేదెలా? ఈ దారుణానికి బాధ్యులెవరు? ఈ వ్యవస్థను నమ్మడమా ప్రజల తప్పా?

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



# డీసీసీలపై కసరత్తు

## సీఎం రేవంత్‌తో సహా కీలకనేతలతో కేసీ వేణుగోపాల్ భేటీ

సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, డిప్యూటీ సీఎం భట్టిలతో విడివిడిగా అభిప్రాయ సేకరణ

కేసీ వేణుగోపాల్ కు నివేదిక అందజేసిన ఏఐసీసీ పరిశీలకులు

బలమైన నేతలకు పగ్గాలు.. సామాజిక సమతుల్యత పాటించే వ్యూహం

**ఢిల్లీ, మహా :** డీసీసీలపై ఏఐసీసీ ముమ్మర కసరత్తు జరుగుతోంది. మునుపెన్నడూ లేని రీతిలో క్షేత్రస్థాయి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ స్థాయి నేతలు 22మందిని తెలంగాణకు పంపిన రాహుల్ గాంధీ నివేదికలు తెప్పించుకున్నారు. ఏఐసీసీ పరిశీలకులు ఇచ్చిన నివేదికపై పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్రంలోని ముఖ్యనేతలతో విడివిడిగా అభిప్రాయాలు సేకరించారు. డీసీసీ అధ్యక్షుల నియామకంపై నేషనల్ అబ్జర్వర్లతో వన్ టు వన్ మీటింగ్ ను కేసీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఎం, పీసీసీ చీఫ్, భట్టి విక్రమార్కలతో విడివిడిగా మాట్లాడి.. అభిప్రాయం తీసుకున్నారు. ఈ నెలాఖరులోగా తెలంగాణలో కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యే అవకాశముంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు.

మిగతా 2లో

### బలమైన నేతలకే అవకాశం

పార్టీని అన్నిస్థాయిల్లో సమర్థవంతంగా నిలిపే నేతలకే అవకాశాలు దక్కనున్నాయి. పార్టీని నడిపించే సమర్థ నాయకులకు డీసీసీ పగ్గాలు అప్పగించాలని భావిస్తోంది. శనివారం పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బలమైన నేతలకే అవకాశాలు లభిస్తాయని, అదే సందర్భంలో సామాజిక సమతుల్యత పాటిస్తామన్నారు. పార్టీ పటిష్టతే లక్ష్యంగా నిర్ణయాలుంటాయన్నారు. నెలాఖరుకు లేదా బీహార్ ఎన్నికల తర్వాత డీసీసీల తుది జాబితా విడుదలయ్యే అవకాశాలున్నాయి. డీసీసీలు ఫైనల్ చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.

# నన్ను క్షమించండి

## అమరవీరుల కోసం కొట్లాడలేకపోయా...

ఇంటి గుట్టు బయట పెట్టి.. కుట్ర చేసి నన్ను బయటకు పంపించారు

20 ఏళ్లు కేసీఆర్, బీఆర్ఎస్‌కు పని చేశా.. ఇప్పుడు నా దారి వెతుక్కున్నా

ప్రతి అమర వీరుల కుటుంబానికి కోటి రూపాయలు వచ్చే వరకు ఉద్యమం చేస్తాం

'జాగృతి జనం బాట' ప్రారంభ కార్యక్రమంలో కవిత హాట్ కామెంట్స్

**నిజామాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అమరవీరుల ఆశయాలను పూర్తిగా నెరవేర్చడంలో, ఉద్యమకారులకు అనుకున్న స్థాయిలో న్యాయం చేయించడంలో గట్టిగా కొట్లాడలేకపోయినందుకు తనను మనస్ఫూర్తిగా క్షమించమని కోరారు. 'జాగృతి జనం బాట' పేరుతో 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు కవిత శనివారం నుంచి నిజామాబాద్ బయలుదేరారు. అంతకుముందు నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో






## వేటు ఖాయం.. ఉప ఎన్నికలు తథ్యం

### పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పాలి

జూబ్లీహిల్స్ మూడోసారి గులాబీ జెండా ఎగరేద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

02

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

12 ఏళ్ల తర్వాత సిలబస్‌లో మార్పులు

ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య

02

## ప్రెస్ క్లబ్ ఎన్నికపై ఉత్కంఠ

- బరిలో సీనియర్లు.. ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా బరిలో గడ్డం క్రిష్ణమూర్తి
- సీరియల్ నెంబర్ 10పై పోటీచేస్తున్న గడ్డం క్రిష్ణమూర్తి
- సీరియల్ నెంబర్ 4పై ఎఎన్ఎన్ సినిమా పాత్రికేయుడు అశోక్ దయ్యాల
- నేడు ఎన్నిక

02










## త్వరలో అంగన్వాడీల్లో
# 14 వేల ఉద్యోగాలు



**హైదరాబాద్, మహా:** రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 181 మంది గ్రేడ్ వన్ సూపర్వైజర్లకు నియామక పత్రాలను మంత్రి సీతక్క స్వయంగా అందజేశారు. 'వేల మందితో పోటీపడి మీరు సాధించిన ఈ కొలువులు మీ కష్టానికి ప్రతిఫలం. మీ నిరీక్షలు ఫలించాయి, మీ ఉద్యోగ కలలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చింది' అని సీతక్క పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థ మహిళా శక్తికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. 'ఐసీడీఎస్ సేవలకు ఈ దేశంలో ఇందిరా గాంధీ ప్రాణం పోశారు. మహిళలకు గౌరవం, చిన్నారులకు సంరక్షణ కలగాలని ఆమె ప్రారంభించిన అంగన్వాడీ సేవలు తెలంగాణ నేల నుంచే బీజం వేశాయి. 1970లో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయి.

**ఈ పదవులన్నీ ఇందిరా గాంధీ చలువే..**

అంగన్వాడీ హెల్పర్ నుంచి మహిళా శాఖ సెక్రటరీ వరకు ఈరోజు ఉన్న పదవులన్నీ ఇందిరా గాంధీ చలువే. ప్రతి మహిళ ఆమెకు రుణపడి ఉండాలి' సీతక్క పేర్కొన్నారు. తెలంగాణలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. "అంగన్వాడీ చిన్నారుల పట్ల కేవలం సానుభూతి కాకుండా సహానుభూతి అవసరం. అంగన్వాడీ సిబ్బందికి ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నాం. త్వరలో 14 వేల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకం చేపట్టబోతున్నాం" అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నన్ను క్షమించండి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది అమరులయ్యారని గుర్తు చేసిన కవిత.. వారి కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామన్నారు. 'కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాం. ఉద్యమకారులకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీట్లు, కొన్ని చోట్ల ఎంపీపీ, జడ్పీటీసీ టిక్కెట్లు దక్కినప్పటికీ.. వారికి దక్కాల్సిన న్యాయం జరగలేదు. అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో "జాగృతి జనంబాట" ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో నా ఓటమి ఓ కుట్రనా? కాదా?. నిజామాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. 20 ఏళ్లుగా కేసీఆర్, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశా. ఇంటి గుట్టు బయట పెట్టి... కుట్ర చేసి నన్ను బయటకి పంపించారు. ఇప్పుడు నా దారి నేను వెతుక్కుంటున్నా. ఈ జిల్లా బిడ్డగా, కోడలిగా మీ ఆశీర్వాదం కోసం వచ్చా. ఇది నా గడ్డ. ఎప్పటికైనా ఈ గడ్డలోనే కలిసిపోతా. దేశ వ్యాప్తంగా ఎక్కడ ఉన్న సరే నా మనసు ఈ గడ్డపైకి కొట్టుకుంటుంది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెగ్డేవార్ ఈ జిల్లాలోని కందకూరులో పుట్టారు. ఇంకో పక్క మనాల అడవుల్లో ఎన్ కౌంటర్లు జరిగినటువంటి చరిత్ర ఉంది. ఆర్ఎస్ యూ, నుంచి ఆర్ఎస్ఎస్ వరకు అందరికీ మద్దతు ఇచ్చిన చరిత్ర మన జిల్లాది. బీఆర్ఎస్ పార్టీ నుంచి మొట్టమొదటి సారి నిజామాబాద్ జెడ్పీ ఛైర్మన్ గెలిచారు. అప్పటి నుంచే ఉద్యమం ఊపందుకుంది. అన్ని భావాజాలలకు మద్దతునిస్తూ ముందున్నటువంటి జిల్లా మనది. మీ బిడ్డను కాబట్టి నన్ను ఇక్కడి నుంచి పార్లమెంట్ కు పంపించారు. మీ మర్యాద, గౌరవం కాపాడే విధంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాను. బీఆర్ఎస్ పార్టీని కూడా దీవించి అన్ని సీట్లు గెలిపించారు. నేను 27 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఉద్యమంలోకి వచ్చా. గత 20 ఏళ్లుగా తెలంగాణ కోసం, కేసీఆర్ కోసం, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశా. మీ కోడలిగా, బిడ్డగా నాకు ఎన్ని కష్టాలు ఎదురైనా సరే సహనంతో ఎదురుచూశా.



నేను బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఏమీ చేయలే. కానీ నన్ను కుట్ర చేసిన పంపించారు. నిజామాబాద్ లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని కోరుతున్నా.

ఈ ప్రభుత్వం రూ. 2500 పెన్షన్ ఇస్తలేదు. పెన్షన్ కోసం ప్రభుత్వం పై పిడికిలి బిగించి కొట్లాడాలె. ప్రభుత్వం మహిళలు, నిరుద్యోగులను చిన్నచూపు చూస్తోంది. గత 10 ఏళ్లలో మనం కొంత సాధించుకున్నాం. కానీ అమర వీరుల కుటుంబాలకు దక్కాల్సిన గౌరవం, న్యాయం దక్కలేదు. ఆనాటి ఉద్యమకారులకు, ఈనాటి ఉద్యమకారులకు కూడా అన్యాయం జరిగింది. ప్రతి అమర వీరుల కుటుంబానికి కోటి రూపాయలు వచ్చే వరకు ఉద్యమం చేస్తాం. ప్రతి ఉద్యమకారునికి ఐడెంటిటీ కార్డు రావాలె. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి వచ్చిన విధంగా పెన్షన్ రావాలి. ఇంకా అనేక అంశాలు, విషయాలు ఉన్నాయి. వాటిపై పోరాటం చేయాల్సి ఉంది. జనం బాటలో మేధావులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలతో మాట్లాడుతాను. ప్రతి ఒక్కరినీ భాగస్వామిగా చేస్తాను. ప్రతి ఒక్కరికి ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి కావాలని నేను కోరుతున్నా .. ఇంత పెద్ద సంఖ్యలో వచ్చి నాకు ఆశీర్వాదం ఇచ్చిన మీరు... ముందు ముందు కూడా నాకు అండగా ఉండాలి. పేద వారికి ఇళ్లు, వైద్యం, విద్య అందాల్సిన అవసరం ఉంది. నిజామాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ లో పరిస్థితి దయనీయంగా మారింది. ఇక గురుకులాల్లో ఆత్మహత్యలు, ఎలుకలు విద్యార్థులను కొరకటం, అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిగ్గుపడాలె. కనీసం వారికి భద్రత, తిండి సరిగా పెట్టలేకపోతున్నారు. ఈ జిల్లాకే చెందిన పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ దీనిపై ఒక్క మాట మాట్లాడటం లేదు. సరైన విద్య, ఉద్యోగాలు, వైద్యం అందించలేకపోతున్నారు. బంగారు లేడినో, ఆకాశం లో పక్షినే మనం అడగటం లేదు. మనకు మంచి తిండి కావాలని అడుగుతున్నాం. బీఆర్ఎస్ నన్ను కుట్ర చేసి పంపించటంతో నా దారి నేను వెతుకుతున్నా. ఇన్నాళ్లు కేసీఆర్ నీడలో ఉన్నా. ఇప్పుడు ఆ నీడలోంచి నన్ను బయట పడేశారు అని' అన్నారు.

# వేటు ఖాయం.. ఉప ఎన్నికలు తథ్యం

### పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పాలి

జూబ్లీహిల్స్ మూడోసారి గులాబీ జెండా ఎగరేద్దాం ..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ ఉన్న అపూర్వమైన బలాన్ని ఈ ఉప ఎన్నికలో చాటాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. "హైదరాబాద్ నగర ప్రజలు మన పార్టీ పట్ల అద్భుతమైన నమ్మకాన్ని చూపించి వందకు వందశాతం సీట్లను గత ఎన్నికల్లో మన పార్టీకే కట్టబెట్టారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని ఆయన అన్నారు. నగర నాయకులకు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు హైదరాబాద్ సమస్యలపై అవగాహన ఉందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరం కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి, చేపట్టిన అన్ని కార్యక్రమాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని సూచించారు. "మన ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలోని ప్రతి గల్లీలో రహదారుల నిర్వహణ నుంచి మొదలుకొని ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన అద్భుతమైన ఫ్లై ఓవర్లు, 20వేల లీటర్ల ఉచిత తాగు నీటి పథకం, ఆటంకాలు లేకుండా నీటి సరఫరా, అద్భుతమైన పారిశుద్ధ్య నిర్వహణ, ప్రతి ఒక్కరికి అందిన అభివృద్ధి సంక్షేమ ఫలాల వరకు అన్నింటిని ప్రజలకు వివరించాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ గెలిస్తే, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికే రెండుసార్లు జీహెచ్ఎంసీ పైన గులాబీ జెండా ఎగిరింది. మూడోసారి కూడా గులాబీ జెండా ఎగరడం ఖాయం" అని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రమే కాదని, హైదరాబాద్ నగరంలో రానున్న రోజుల్లో పార్టీ మారిన ఖైరతాబాద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు కచ్చితంగా పడుతుందని, ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పవని కేటీఆర్ అన్నారు. వీటితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక విజయం ఖాయమని, అయితే మెజార్టీ కోసం మనం మరింత కష్టపడాలని కేటీఆర్ నాయకత్వానికి సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటు వేసేలా ప్రజలకు మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు.

## ప్రెస్ క్లబ్ ఎన్నికపై ఉత్కంఠ

**హైదరాబాద్, మహా:** ప్రెస్ క్లబ్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఆదివారం జరగనున్న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎక్కువమంది సీనియర్ పాత్రికేయులు ఉన్న సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వేయిమందికి పైగా ఓటర్లున్నారు. మన జర్నలిస్టు మిత్రుల కోసం నేనున్నానంటూ.. తొలిసారి సీనియర్ పాత్రికేయుడు ఎఎన్ఎన్ బ్యూరో చీఫ్ గడ్డం క్రిష్ణమూర్తి బరిలో నిలిచారు. నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయుడిగా ఉన్న క్రిష్ణమూర్తి తొలిసారి ఎగ్జిక్యూటివ్ గా పోటీలో ఉన్నారు. ఆంధ్రప్రభతో పాటు వివిధ పత్రికల్లో పనిచేసి తనదైన ప్రత్యేకత చాటుకున్నారు. ఇక సినిమా పాత్రికేయుడిగా అందరికీ తలలో నాలుకగా ఉన్న అశోక్ దయ్యాల గత ఎగ్జిక్యూటివ్ కమిటీలో స్వల్ప తేడాతో ఓడగా, ఈసారి విజయం ఖాయమన్న ధీమా వ్యక్తమవుతోంది. మార్పు కోసం, మంచి కోసం కదిలిన ఎఎన్ఎన్ జర్నలిస్టులకు సీనియర్ పాత్రికేయులు ఓటర్ల నుండి అనూహ్య మద్దతు లభిస్తోంది. అందరితో మంచిగా ఉండే ఇద్దరూ విజయం సాధించాలని ప్రెస్ క్లబ్ మార్పు కోరేవారు, మంచి కోరే వారు కోరుకుంటున్నారు.

# దూసుకొస్తున్న మొంథా

### తెలంగాణపై ఎఫెక్ట్.. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**హైదరాబాద్, మహా:**

బంగాళాఖాతంలోకొనసాగుతున్నవాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా శనివారం భారీ వర్షం కురిసింది. అయితే బంగాళాఖాతంలో కొనసాగుతనున్న వాయుగుండం పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ... రేపటికి తీవ్ర వాయుగుండంగా, ఎల్లుండి ఉదయానికి తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక, దీనికి మొంథా తుపానుగా నామకరణం చేశారు. అయితే ఈ ప్రభావంతో తెలంగాణలో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ, తూర్పు జిల్లాల్లో అక్టోబర్ 27 నుంచి 29 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నట్టుగా తెలిపారు. తెలంగాణలో రాబోయే ఐదు రోజుల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు.

### రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు..

నేడు (ఆదివారం) ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆయా జిల్లాకు ఎల్లో అలర్ట్ జారి చేసింది. సోమవారం (అక్టోబర్ 27) రోజున రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆయా జిల్లాకు ఎల్లో అలర్ట్ జారి చేసింది.

## ఏదో ఒకరోజు

### అమెరికా దేశాధ్యక్షురాలిని అవుతా

**కమలా హారిస్ ఆశాభావం**

**మహా:** అమెరికా మాజీ అధ్యక్షురాలు, భారత సంతతి మహిళ కమలా హారిస్ తాజాగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను అమెరికా అధ్యక్ష పదవి కోసం మరోసారి పోటీచేసే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. తాను ఏదో ఒకరోజు దేశాధ్యక్షురాలిని కావచ్చు అని, భవిష్యత్తులో శ్వేతసౌధంలో ఓ మహిళా అధ్యక్షురాలు ఉంటుందన్న విశ్వాసం ఆమె వ్యక్తం చేశారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ గురించి తాము చేసిన హెచ్చరికలు, ఇప్పుడు నిజమైనవని నిరూపితమయ్యాయి అని అన్నారు.

# డీసీసీలపై కసరత్తు



(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ పాల్గొన్నారు. డీసీసీలపై కసరత్తు పూర్తిచేయడంతో పాటు ఆదివారం జాబితాను ఫైనల్ చేసి పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు, అగ్రనేత రాహుల్ గాంధీకి అందజేసే అవకాశాలున్నాయి. సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ అగ్రనేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఆదివారం ఢిల్లీకి వెళ్ళనున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, రాష్ట్ర రాజకీయాలపైనే నేతలు చర్చించారు.

## ఉక్కుమనిషి భావితరాలకు స్ఫూర్తిదాయకం

### మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు




**మెదక్, మహా :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్ మెదక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్ మెదక్ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం దేశ సమైక్యత, సేవా భావం పెంపొందించడంతోపాటు యువతి,యువకుల్లో వృత్తి నైపుణ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 530 సంస్థానాలను భారత దేశంలో విలీనం చేసి ఒక పటిష్టమైన భారతదేశంగా ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలకు మార్గదర్శకులు అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువతి,యువకులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలోని అన్ని కళాశాలలో ఉపన్యాస, వ్యాస రచర , రంగోలి లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ , ఎన్ సి సి, ప్రభుత్వ శాఖలైన పోలీస్, విద్య వైద్య ,ఇతర శాఖలను భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఏక్ భారత్ ,శ్రేష్ఠ భారత్ గా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ప్రతి వ్యక్తికి దేశమే ముందు ఏదైనా ఆ తర్వాతే అని పేర్కొన్నారు. అనంతరం మేర యువభారత్ మెదక్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేర యువభారత్ అధికారి రంజిత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఎంటీఏఆర్ కార్మిక ఎన్నికలో బీఆర్ఎస్ విజయం

### ఎంపీ రఘునందన్ రావుపై శ్రీనివాస్ గౌడ్ విక్టరీ

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో బాలానగర్‌లోని ఎంటీఏఆర్ టెక్నాలజీస్ లిమిటెట్ కంపెనీలో బీఆర్ఎస్ నుంచి కార్మికుల గుర్తింపు యూనియన్ ఎన్నికలో భారత ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్.. బీజేపీ ఎంపీ రఘునందన్ రావుపై గెలుపొందారు. ప్రత్యర్థి రఘునందన్ రావుని ఓడించి, భారత ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఎంటీఏఆర్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి 359 మంది కార్మికులను పర్మనెంట్ చేసి, కార్మికులకు క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే కార్మికులకు బేసిక్‌ను 30 శాతం నుండి 50 శాతానికి పెంచడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు తనపై నమ్మకం పెట్టుకొని గెలిపించిన కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీలో కార్మికులకు ఉన్న ఎలాంటి సమస్యనైనా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా. ఈ కార్యక్రమంలో ఎంటీఏఆర్ కంపెనీ బీఆర్టీయూ యూనియన్ జనరల్ సెక్రటరీ మాయ రాజయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సత్యప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌లు వెంకటేశ్వర రెడ్డి, సమ్మయ్య, రాయుడు యాదవ్ తదితరులు ఉన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



- తూకంలో అధికంగా తరుగు తీసుకుంటే మిల్లర్లపై కఠిన చర్యలు
- ధాన్యం కొనుగోలు కేంద్రలు ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి

**మెదక్ జిల్లా, మహా :** ప్రభుత్వం వరి ధాన్యం చివరిగింజ వరకూ కొనుగోలు చేస్తుందని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి స్పష్టం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలంలోని కొంతన్ పల్లి, ఉసిరిక పల్లి, రత్నాపూర్, సీతారాం తండా, అల్లిపూర్ మరియు పిల్లుట్ల, గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట ఉత్పత్తులను దళారులకు విక్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ధాన్యం తూకంలో అధికంగా తరుగు తీసుకుంటే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం విక్రయించేందుకు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, సీఈవో మధు యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బండారి గంగాధర్, సోనీ రావి నాయక్ , పీఏసీఎస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పెంట గౌడ్, ఏఈవో వందన మౌనిక రాము , నాయకులు, పెద్ద ఎత్తున రైతులు వివిధ గ్రామల ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

### 12 ఏళ్ల తర్వాత సిలబస్‌లో మార్పులు

ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇంటర్2025 పరీక్షల తేదీ ఖరారు అయ్యాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ సిలబస్‌లోనూ మార్పులు చేసింది. ఈ నిర్ణయంతో ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండనున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలతో పాటు ప్రాక్టికల్స్, పరీక్షల్లో చేస్తున్న మార్పులపై ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలు వివరాలను వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9 లక్షల 50 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ సబ్జెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో తప్పులకు తావు ఉండకూడదు

### సీఈవో సుదర్శన్ రెడ్డి

**మెదక్ , మహా :** జిల్లాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ B లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ C లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ D లో 20022007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సీ, క్యాటగిరి డీ లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఎ ఈ ఆర్ఆ ఓ ల ఆధ్వర్యంలో బి ఎల్ ఓ సూపర్ వైజర్లు, బి ఎల్ ఓ లు బి ఎల్ ఓ యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ....స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా... దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ నగేష్ లోమ్, ఆర్డీ వో లు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ లు, కలెక్టరెట్ సూపరింటెంట్లు తదితరులు పాల్గొన్నారు

# రూ.855 కోట్లతో రిలయన్స్ ఏఐ

రిలయన్స్ ఏఐ మరో సంచలనం కాబోతోంది. ఇండియన్ బిలియనీర్ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పుడు ఏఐ సర్వీసులు పై దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగా త్వరలో రిలయన్స్ ఏఐ వెంచర్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. రిలయన్స్ ఎంటర్ ప్రైజెస్, మెటాకు చెందిన అనుబంధ సంస్థ ఫేస్‌బుక్ ఓవర్సీస్, ఐఎన్‌సీ కలిసి ఈ జాయింట్ వెంచర్‌ను ప్రారంభించనున్నాయి. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. రూ.855 కోట్ల పెట్టుబడితో ప్రారంభించనున్న ఈ జాయింట్ ఏఐ వెంచర్‌లో రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ వాటా 70 శాతం, మెటా అనుబంధ సంస్థ అయిన ఫేస్‌బుక్ ఓవర్సీస్ ఇంక్ 30 శాతం వాటాను కలిగి ఉంటాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన అనుబంధ సంస్థ రిలయన్స్ ఇంటెలిజెన్స్ లిమిటెడ్. ఇది 2025 అక్టోబర్ 24న రిలయన్స్ ఎంటర్‌ప్రైజ్ ఇంటెలిజెన్స్ లిమిటెడ్ (ఆర్‌ఈఐఎల్) అనే కొత్త కంపెనీని ప్రారంభించింది. ఈ ఆర్‌ఈఐఎల్ అనేది ఎంటర్‌ప్రైజ్ ఏఐ సేవలను అభివృద్ధి చేస్తుంది. మార్కెట్ చేస్తుంది. పంపిణీ చేస్తుంది. అయితే ఈ జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గానీ, నియంత్రణ సంస్థల నుంచి గానీ ఎలాంటి అనుమతులు అవసరం లేదని రిలయన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

**అందుబాటు ధరలో...**

రిలయన్స్‌ఫేస్‌బుక్ జాయింట్ ఏఐ వెంచర్ ప్రధాన లక్ష్యం భారత్‌లోని వ్యాపారాల కోసం, అలాగే అంతర్జాతీయ మార్కెట్లో కోసం ఎంటర్‌ప్రైజ్ స్థాయి ఏఐ సొల్యూషన్స్ అభివృద్ధి చేయడం. మెటాకు చెందిన ఓపెన్ సోర్స్ లామా మోడల్స్ ఆధారంగా ఈ ఏఐ వెంచర్ పని చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే, మెటాకు చెందిన అధునాతన ఏఐ మోడళ్లను, రిలయన్స్‌కు చెందిన డిజిటల్ మౌలిక సదుపాయాలతో కలిపి, వ్యాపారాల కోసం శక్తివంతమైన ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా సేల్స్, మార్కెటింగ్, ఐటీ, కస్టమర్ సర్వీస్, ఫైనాన్స్ వంటి వ్యాపార విభాగాల కోసం కస్టమైజ్డ్ ఏఐ మోడల్స్‌ను తయారు చేస్తారు. సాధారణంగా ఎంటర్‌ప్రైజ్ స్థాయి ఏఐ సాధనాలు చాలా కాస్ట్‌లీగా ఉంటాయి. కానీ రిలయన్స్, ఫేస్‌బుక్ చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు సైతం ఉపయోగపడేలా అందుబాటు ధరలోనే తమ ఏఐ సెల్యూషన్స్‌ను అందించాలని నిర్ణయించాయి. రిలయన్స్ ఏం చేసినా ధరల యుద్ధం ప్రకటించి.. సామాన్యులకు సేవలను చేరువచేయడం లక్ష్యంగా ముందుకెళ్తుంది. ఇపుడు కూడా అదే యుద్ధం చేయబోతున్నట్లు కనబడుతోంది.

**- మహా, స్పెషల్**

# దౌర్భాగ్య స్థితిలో ఎంజీఎం ఆస్పత్రి

## ఇద్దరి పిల్లలకు ఒక్కటే ఆక్సిజన్ సిలిండర్ తో వైద్య పరీక్షలకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు

## ఎంజీఎం ప్రతిష్టను దిగజారుస్తున్న ఎంజీఎం అధికారులు




**వరంగల్ మహా :** ప్రభుత్వాలు మారిన, ప్రజా ప్రతినిధులు మారిన ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కైనా పేదల పెద్ద ఆసుపత్రి వరంగల్ ఎంజీఎం పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడం లేదని ఎంజీఎంలో జరిగే కొన్ని సంఘటనలు చూస్తే తెలుస్తోంది. ఎంజీఎంను ప్రక్షాళన చేస్తామని అధికార పార్టీ మంత్రులు ఎమ్మెల్యేల సందర్శన, ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించినప్పటికీ ఎంజీఎం అధికారుల తీరు, సిబ్బందిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని స్పష్టంగా అర్థమవుతుంది. ఒకే గ్యాస్ పైపుకు రెండు పొయ్యిలు ఉండవచ్చు కానీ ఒకే ఆక్సిజన్ సిలిండర్ ద్వారా అత్యవసర చికిత్సలో ఉన్న ఇద్దరి పసిపిల్లలకు ఆక్సిజన్ అందించడం ఎంజీఎం వైద్య అధికారులకే వైద్యులకే చెల్లుబాటు అవుతుంది. వినడానికి విచిత్రంగా అనిపించినా ఇదే కోవలో శనివారం ఎంజీఎం లో ఓ సంఘటన చోటు చేసుకుంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సర్వసాధారణంగా సరిపడా ఆక్సిజన్ లేదా? పొదుపు పాటిస్తున్నారా? అనేలా వైద్యుల తీరు విస్మయానికి గురి చేస్తోంది. ఇద్దరు పసిపిల్లలకు ఒక్క ఆక్సిజన్ సిలిండర్ నుంచే ఆక్సిజన్ అందిస్తుండడం ఆస్పత్రి వర్గాల పై ప్రజల నుండి అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఒక్క సిలిండర్తో ఇద్దరు పసిపిల్లలను ఆస్పత్రి ఆవరణలోకి తీసుకురావడం అందరినీ కలిచివేసింది. వైద్యుల తీరుపై ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేషంట్ కేర్, దయమ్మ వారు పేషెంట్లను తరలించాల్సి ఉండగా వారు అందుబాటులో లేకపోవడంతో పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంవల్ల తల్లిదండ్రులే ఆ పిల్లలను ఓ చేత్తో ఎత్తుకొని మరో చేతితో గ్యాస్ సిలిండర్ ను తల్లిదండ్రులే తీసుకొని వైద్య పరీక్షలకు తీసుకువెళ్లడంపై ఆస్పత్రి నిర్వహణ ఎంత దయనీయ స్థితికి దిగజారిందో స్పష్టంగా అర్థమవుతోంది.

ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రి సేవలు రోజురోజుకు అధ్వానంగా మారుతున్నాయనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా నిలుస్తుంది. ఆస్పత్రిలో సేవలను పర్యవేక్షించేందుకు ఇద్దరు ఆర్ఎంవోలు, పదుల సంఖ్యలో డాక్టర్లతో పాటు జూనియర్ డాక్టర్లు, వందల సంఖ్యలో నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నా రోగుల తో పాటు కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు పడుతుండడం అందరి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. జిల్లా కలెక్టర్ పలుమార్లు గంటల కొద్దీ ఆస్పత్రిని సందర్శించినా, వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసినా ఆస్పత్రి నిర్వహణలో మార్పు రావడం లేదు.. వైద్యులు, సిబ్బందిలో అలసత్వం వీడడం లేదు. ఇంకా ఈ ఆస్పత్రిని అధికారులు, సిబ్బంది కలిసి ఏ దుస్థితికి దిగజారుస్తారో తెలియడం లేదని ప్రజాసంఘాలు మండి పడుతున్నాయి. ఈ ఇటీవల ఎంజీఎంలో చోటు చేసుకున్న సంఘటనలపై ఆరోగ్య శాఖ మంత్రి ఎంజీఎం అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంజీఎం లో కొన్ని ఏళ్లుగా పాతుకుపోయిన అధికారులు సిబ్బందిపై సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం.

# హామ్ టెండర్లలో రూ.8 వేల కోట్ల స్కామ్

**ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం లూటీ చేస్తోంది**

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపణలు**



**హైదరాబాద్, మహా:** ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి ,పూటకో కుంభకోణం బయటపడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ఎద్దేవా చేశారు. డెక్కన్ సిమెంట్స్ వాళ్ళని గన్ పెట్టి బెదిరించారని ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారని గుర్తు చేశారు. మద్యం సీసాల హోలోగ్రాం కుంభకోణంలో సీఎం మంత్రి వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. తాజాగా హామ్ పేరుతో మరో స్కామ్‌కు పాల్పడనట్టు ఆరోపించారు. హైబ్రిడ్ అన్యుటీ మోడ్ టెండర్లలో 8 వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందన్నారు ప్రశాంత్ రెడ్డి. హమ్‌లో కిలోమీటర్‌కు 85 శాతం అంచనా వ్యయం పెంచారని తెలిపారు. తొమ్మిది వేల కోట్ల రూపాయలతో పూర్తి అయ్యే రోడ్లకు పదిహేడు వేల కోట్ల రూపాయలకు టెండర్లు పిలిచారని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. 8 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం లూటీ చేస్తోందన్నారు. సీఆర్ఎఫ్ కింద కిలోమీటర్‌కు కోటి 75 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, హామ్ కింద ఇచ్చిన టెండర్లలో కిలోమీటర్‌కు మూడు కోట్ల 30 లక్షల రూపాయలు ఖర్చవుతుందని గుర్తు చేశారు. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన రోడ్ల పనుల టెండర్ల జీవో,హామ్ జీవో కేవలం పది రోజుల తేడాలో వచ్చాయని జీవోలను వేముల చూపించారు. సీ ఆర్ ఎఫ్ కింద ఇచ్చిన జీవోలో కిలో మీటర్ కు ఓ రేటు ,హామ్ జీవోలో కిలోమీటర్ కు మరో రేటు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. హామ్ రోడ్ల టెండర్లు దక్కించుకున్న వారికి పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ప్రభుత్వం చెల్లిస్తోందని అన్నారు. ఈ పదిహేడు వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయో అందరికీ తెలుసన్నారు. హామ్ కింద కిలో మీటర్ రోడ్డుకు మెయింటెనెన్స్ కు మరో 2.5 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని, అంటే కిలో మీటర్ రోడ్డుకు హామ్ కింద 6 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని పేర్కొన్నారు.

## చేనేత కళా వైభవానికి వేదికగా నిలిచిన

# హైదరాబాద్ శారీ ఫెస్టివల్

**మంత్రి తుమ్మల చేతుల మీదుగా...హైదరాబాద్ శారీ ఫెస్టివల్ ప్రారంభం**

**ఆకట్టుకుంటున్న సంప్రదాయ చీరల కలెక్షన్**

**ప్రదర్శన ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**హైదరాబాద్,మహా:** భారతీయ చేనేత కళా వైభవానికి హైదరాబాద్ మరోసారి వేదిక అయింది. రంగు రంగుల చేనేత చీరలతో నగరం కళకళలాడుతుంది. ఈ అద్భుత కళాత్మక ప్రదర్శనకు కేరాఫ్ గా నిలిచిన 'హైదరాబాద్ శారీ ఫెస్టివల్'ను చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ ఫెస్టివల్ ఈనెల 30వ తేదీ వరకు అమీర్‌పేట్‌లోని కమ్మ సంఘం ప్రాంగణంలో జరగనుంది. ఈ ప్రారంభోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ట్రస్ట్ బోర్డు సభ్యులు జీ భాను ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుక నేషనల్ డిజైన్ సెంటర్, డెవలప్‌మెంట్ కమిషనర్ (హ్యాండ్లూమ్స్), టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ మద్దతుతో నిర్వహిస్తున్నారు. వారం పాటు జరిగే ఈ ఉత్సవం ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 62 మంది చేనేత కళాకారులు, 13 మంది హ్యాండీక్రాఫ్ట్ కళాకారులు తమ కళాత్మకతను ప్రదర్శించనున్నారు. ఈ ఉత్సవంలో దేశ నలుమూలల నుంచి తెచ్చిన సంప్రదాయ చీరల కలెక్షన్ ఆకట్టుకోనుంది. ఇది దేశంలోని ప్రాంతీయ చేనేత సంప్రదాయ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఉత్తరప్రదేశ్ నుంచి బెనారస్ చీరలు, ఆంధ్రప్రదేశ్ నుంచి కాటన్ బుట్టా, కలంకారీ చీరలు, ఛత్తీస్‌గఢ్ నుంచి కోసా చీరలు, గుజరాత్ నుంచి పటోలా చీరలు, బిహార్ నుంచి భగల్పూర్ సిల్క్ చీరలు, తెలంగాణ నుంచి హ్యాండ్‌లూమ్ సిల్క్ చీరలు, ఒడిశా నుంచి ఇకాట్ చీరలు, మధ్యప్రదేశ్ నుంచి చందేరీ చీరలు, మహారాష్ట్ర నుంచి పైథాణీ చీరలు, ఝార్ఖండ్ నుంచి తుస్సర్ సిల్క్ చీరలు, రాజస్థాన్ నుంచి కోటా డోరియా చీరలు, తెలంగాణ నుంచి పొచంపల్లి ఇక్కత్ కాటన్, సిల్క్ చీరలు ప్రదర్శనలో ఉంటాయి. ప్రతి చీర భారతీయ చేనేత వారసత్వంలోని కళాత్మకత, సంప్రదాయం, సాంస్కృతిక సంపదను ప్రతిబింబించనుంది. హైదరాబాద్ శారీ ఫెస్టివల్ కేవలం ప్రదర్శన మాత్రమే కాదు. ఇది ఒక సాంస్కృతిక పరస్పర మాధ్యమం. సందర్శకులు నేరుగా చేనేత కళాకారులతో మాట్లాడి, వీటి సౌందర్యాన్ని అర్థం చేసుకునే అవకాశం కలదు. సంప్రదాయ డిజైన్‌లు, సూక్ష్మ నేత పద్ధతులు, ప్రాంతీయ ప్రత్యేకతలు తెలుసుకోవచ్చు. చేనేత చీరలను ప్రోత్సహించడం, కళాకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఫ్యాషన్‌పై అవగాహన కల్పించడం ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యం.

# లేదంటే వేతనాలు నిలిచిపోతాయ్..

## ఐఎఫ్ఎంఐఎస్‌కు ఆధార్ లింక్ చేయాల్సిందే...

## రాష్ట్రంలో ఉద్యోగుల వేతనాల చెల్లింపుపై ఆర్థికశాఖ హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** మంత్రివర్గ నిర్ణయానికి అనుగుణంగా ఉద్యోగులు, సిబ్బంది కచ్చితంగా ఆర్థిక శాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)కు ఆధార్ లింక్ చేయాల్సిందేనని ఆదేశించింది. శనివారం అర్ధరాత్రి వరకు అందరూ ఆధార్ లింక్ చేయాలని స్పష్టం చేసింది. లేదంటే వేతనాలు నిలిచిపోతాయని స్పష్టం చేసింది. అయితే అన్ని శాఖల్లో కలిపి శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు మొత్తం 10.14 లక్షల మంది ఉన్నారు. వీరందరి పేర్లు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ ప్రతి నెల 10 వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)లో నమోదు చేయాలని గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ నెల 16 వరకు సగం మంది వివరాలు కూడా నమోదు చేయలేదు. ఈ క్రమంలో వివరాలివ్వనివారి జీతాల బిల్లులు ఈ నెలలో ఆమోదించేది లేదని ఆర్థికశాఖ హెచ్చరించింది. ఉద్యోగుల సమగ్ర వివరాలన్నీ లేకపోవడంతో కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో తాత్కాలిక ఉద్యోగులు మానేసినా, అనధికారికంగా సుదీర్ఘ సెలవులో వెళ్లినా వారి పేర్లతో వేతనాలు డ్రా చేస్తున్నారని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో పేరు, ఆధార్, సెల్ నంబర్లతో పోల్చిచూస్తే ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే స్పష్టమైన వివరాలు అందుతాయని భావించి వివరాలు పంపాలని కోరగా పలు కార్యాలయాలు స్పందించడం లేదు.



# కన్నుల పండుగలా.. కార్తీక దీపోత్సవం

- = రాష్ట్రంలోని ప్రతి దేవాలయం దీపాలతో అలంకరించి
- = ఎండోమెంటు అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- = రాష్ట్రంలోని అన్ని ఆలయాల ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మహా:** కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించాలని.. రాష్ట్రంలోని ప్రతి దేవాలయం దీపాలతో అలంకరించాలని ఎండోమెంట్ ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కార్తీక దీపోత్సవం ఈ నెల 22 నుంచి వచ్చే నెల 19 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు శైలజ రామయ్యర్, హరీష్, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంటు కమిషనర్లు, ఈవోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల ఈవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కార్తీక మాసం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని గుర్తు చేశారు.

**కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా..**

ఈ కార్తీక మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదంగా ఉంటుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. సామూహిక కార్తీక దీపోత్సవం అంటే అందరూ కలిసి దేవాలయ ప్రాంగణములో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చేయాలని గుర్తు చేశారు. గతంలో నిర్వహించినట్లుగా ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవం సా. 6.00 గం.ల నుండి జరపాల్సి ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటుగా పసుపు, కుంకుమ తాంబూలాలను మహిళా భక్తులకు అందచేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హరీష్, అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# మేము రెడీ.. నువ్వు సిద్ధమా?

**పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం**

**హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వస్తాం...మీరు?**

**సిద్దిపేటలో హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి ఛాలెంజ్**



**సిద్ధిపేట, మహా:** కేబినెట్ సమావేశాన్ని హరీష్ రావు దండుపాళ్యం బ్యాచ్ అనడం బాధాకరామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. సిద్ధిపేటలో శనివారం మీడియాతో మాట్లాడుతూ..ఉద్యమ నాయకుడు ఇలా అనడం సిగ్గు చేటు అంటూ మండిపడ్డారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీష్ రావు మంత్రిగా పని చేశారని.. ఆ విషయం హరీష్ మరవద్దని అన్నారు. మంత్రి వర్గంలో ప్రజలకు అవసరం అయ్యే మీటింగ్ తప్ప.. దండుపాళ్యం లాగా దోచుకోవడం కోసం మీటింగ్ పెట్టలేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి అలా అనడం బాధాకరమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో తనను తిట్టించడం దారుణమని మండిపడ్డారు. హరీష్ భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తెలంగాణా ఏర్పాటులో తాము కూడా త్యాగాలు చేశామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఇంతగా టార్గెట్ చేయడం ఏంటని సీరియస్ అయ్యారు.

**ఆస్తులు, ఫామ్ హౌస్‌లు కాదు.. ఆత్మగౌరవం ముఖ్యం**

2014 బీఆర్ఎస్ హామీలను నెరవేర్చారా అని ప్రశ్నించారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటి కో ఉద్యోగం లాంటి హామీలు ఏమయ్యాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రిని ఏకవచనంతో మాట్లాడటం ఏంటంటూ ఫైర్ అయ్యారు. 10 ఏళ్లలో ఎప్పుడైనా ఒక్క నియామక పత్రం ఇచ్చారా అని అడిగారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు మిత్తీలు కట్టుకుంటూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలును నేరవేర్చక పాతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలన, రెండేళ్లలో కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. 'హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మేము వస్తాం మీరు వస్తారా' అంటూ ఛాలెంజ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఎందుకు అమలు చేయడంలేదో రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. 'నేను వివాదం చేయడానికి ఇక్కడికి రాలేదు. మాకు ఆస్తులు, ఫామ్ హౌస్‌లు కాదు మా దళితులకు ఆత్మగౌరవం ముఖ్యం. జూబ్లీహిల్స్, గ్రామస్థాయి ఎన్నికలు ఉన్నాయ్ అందులో ప్రజలు ఎవరికీ బ్రహ్మరథం పడుతారో చూద్దాం' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# రూ.86 కోట్ల భూమి కాపాడిన హైడ్రా

## కొండాపూర్ లో 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్

## ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు




**రంగారెడ్డి, మహా:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండపూర్లో మరో పెద్ద భూకబ్జాను హైడ్రా అడ్డుకుంది. దాదాపు రూ. 86 కోట్ల విలువైన భూమిని కాపాడింది. శుక్రవారం రాఘవేంద్ర కాలనీలో 2000 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా, ఆ దగ్గరలోనే ప్రజావసరాలకు ఉద్దేశించిన 4300 గజాల స్థలాన్ని శనివారం కాపాడింది. కొండపూర్, రాజరాజేశ్వరి నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీలో 4300 గజాల స్థలానికి కబ్జాల చెర నుంచి విముక్తి హైడ్రా విముక్తి కల్పించింది. 1978 లో వేసిన గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో మొత్తం 350 ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ పాఠశాల భవనంతో పాటు ఇతర ప్రజావసరాల కోసం 4300 గజాల స్థలాన్ని అప్పట్లో లేఅవుట్ చేసిన చింతల పోచయ్య, ఆయన కుటుంబ సభ్యులు చూపించారు. అదే స్థలాన్ని లేఔట్ వేసిన పోచయ్య తో పాటు ఆయన కుటుంబ సభ్యుడు చింతల రాజు 3 భాగాలుగా విడదీసి లావాదేవీలు నిర్వహించడంలో కొళ్ల మాధవ రెడ్డి హస్తం ఉందని తప్పుడు డాక్యుమెంట్లతో అమ్మకాలు చేశారంటూ వాపోయారు. కొళ్ల మాధవరెడ్డి కుమారుడు ఒక భాగాన్ని కొనగా.. చింతల పోచయ్య, చింతల రాజు పేరిట మీద రెండు భాగాలు ఉన్నట్టు డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ మూడు భాగాల్లో కొళ్ల మాధవరెడ్డి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకుని దందా నడుపుతున్నారు. ఇదే విషయాన్ని కాలనీ ప్రతినిధులు జీహెచ్ఎంసీకి గతంలో ఫిర్యాదులు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు నిజమే అని నిర్ధారించుకున్నాక హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం అక్కడ ఆక్రమణలను తొలగించింది. 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. అలాగే అక్కడ భూమిని అమ్మిన పోచయ్య, రాజుతో పాటు స్థలాన్ని కొన్న కొళ్ల మాధవరెడ్డితో పాటు అతని కుమారుడి పైన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులను నమోదు చేశారు.




# గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా పైళ్ల గణపతి రెడ్డి

**వలిగొండ, మహా :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన పైళ్ల గణపతి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా పైళ్లగణపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయిలు వేతనాలు చెల్లించాలని బడ్జెట్ కేటాయించాలనీ గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించేందుకు పోరాటం నిర్వహిస్తామన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డుల కోసం మరియు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# ఈ దారుణానికి బాధ్యులెవరు?

**ప్రజా రవాణా ప్రైవేట్ చేతుల్లోకి వెళ్ళాక.. బస్సెక్కాక గమ్యస్థానం చేరుతామో లేదోనన్న భయానక పరిస్థితులు నెలకొన్నాయి. లాభాల కోసం శవపేటికలు నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రజల ప్రాణాలు హరీమనిపిస్తున్నాయి. ఫిట్ నెస్ ముగిసి.. 16 చలాన్లు ఉన్నా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ వీధుల్లో దర్జాగా తిరిగిందంటే కళ్ళకు గంతలు కట్టుకున్న అధికారుల తీరు కళ్ళకు కడుతుంది. రవాణా రంగంలో పెరుగుతున్న నిర్లక్ష్యం, అధికారుల మౌనం, ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డగోలు దందా — ఇవన్నీ కలసి యమపాశాల్లా మారుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులు, శిక్షణ లేని డ్రైవర్లు, నిర్లక్ష్యపు తనిఖీలు... చివరికి బలవన్మరణాలే ఫలితమా? ప్రజా రవాణా రంగం ఎవరి చేతుల్లో నడుస్తోంది? ఈ వ్యవస్థలోని మాఫియా గుట్టు ఎప్పుడు విప్పబడుతుంది? ప్రభుత్వం ఈ రవాణారంగాన్ని నిర్వహించలేదా? ఇంకెన్ని ప్రాణాలు పోవాలి? సంతాపపు ప్రకటనలు.. సంఘటన జరిగిన తర్వాత జరిగే మొక్కుబడి తనిఖీలతోనే సరా? ఇవి ఆగేదెలా? ఈ దారుణానికి బాధ్యులెవరు? ఈ వ్యవస్థను నమ్మడమా ప్రజల తప్పా?**

**- తాజా బస్సు ప్రమాదం నేపథ్యంలో ఎఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

కర్నూలు జిల్లాలో జరిగిన వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం మరోసారి రవాణా వ్యవస్థలోని డొల్లతనాన్ని, నిర్లక్ష్యాన్ని వాస్తవాల్ని బట్టబయలు చేసింది. ఈ ఘోర దుర్ఘటనలో 20 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఒక్క కుటుంబానికే కాదు — రెండు రాష్ట్రాలను కుదిపేసిన విషాదం. కానీ ప్రశ్న ఒక్కటే — ఈ దారుణానికి బాధ్యులెవరు? ప్రైవేట్ ట్రావెల్స్ లాభాల మత్తులో ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. ఫిట్‌నెస్ లేకుండా, ఇన్సూరెన్స్ లేకుండా, పాత బస్సులను స్లీపర్‌గా మార్చి రోడ్లపైకి దింపుతున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు 16 ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసినా అధికారుల కళ్ళు మూసుకుపోయాయి. 23 వేల రూపాయల చలానాలు ఉన్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఫిట్ నెస్ గడువుముగిసినా కళ్ళు మూసకున్నారు. ఇది నిర్లక్ష్యం కాదు — మాఫియాకి దాస్యమే.

డ్రైవర్లకు సరైన శిక్షణ లేదు, పని ఒత్తిడితో నిద్రమత్తులో వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదం సమయంలో డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టిన తర్వాత ఆగకుండా 300 మీటర్ల దూరం లాగడంతో మంటలు చెలరేగాయి. ఒక్క క్షణం ఆలోచించి ఆగి ఉంటే... ఆ 20 ప్రాణాలు కాపాడేవి. కానీ ఆలోచనకన్నా అలవాటు గెలిచింది. ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు — వీరంతా మామూళ్ల మత్తులో ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతినెలా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల నుంచి "హామీ"లు అందుతుండటంతో తనిఖీలు కాగితాలపై మాత్రమే జరుగుతున్నాయి. ఫిట్‌నెస్ లేకపోయినా, ఇన్సూరెన్స్ ముగిసినా, బస్సులు నగర వీధుల్లో దర్జాగా తిరుగుతుండటం దీని ప్రత్యక్ష నిదర్శనం.

ఒకప్పుడు ప్రజా రవాణా అంటే సురక్షిత ప్రయాణానికి ప్రతీక. ఇప్పుడు అది సాహసయాత్రగా మారిపోయింది. ప్రజా రవాణా రంగాన్ని ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించాక, ప్రాణాలతోనే ఆటలు మొదలయ్యాయి. లాభాల కోసం స్లీపర్ బస్సులను శవపేటికలుగా మార్చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అంటే ఇప్పుడు మామూలు రశీదే. వాహనం ఏ స్థితిలో ఉన్నా, కొద్దిపాటి నజరానాతో ఆర్టీఏ సర్టిఫికెట్ ముద్రేస్తుంది.



సీటింగ్ బస్సును స్లీపర్‌గా మార్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసి, మరో రాష్ట్రంలో నడిపిస్తూ చట్టాన్ని చులకన చేస్తున్నారు.

ఈ ఏడాది మార్చి 31వ తేదీన ప్రమాదం జరిగిన బస్సు ఫిట్‌నెస్ వాలిడిటీ ముగిసింది. పొల్యూషన్ వాలిడిటీ 2024 ఏప్రిల్ 2వ తేదీతో ముగిసింది. ఇన్సూరెన్స్ వాలిడిటీ కూడా గత ఏడాది ఏప్రిల్ 20న ముగిసింది. అయినా తెలంగాణ, ఏపీ రవాణా అధికారులు బస్సును సీజ్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేనట్లయితే ఆర్డీఏ అధికారులు బస్సును సీజ్ చేస్తారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అప్పగిస్తే కేసు నమోదు చేసి బస్సును వదిలేస్తారు. చాలా సందర్భాలలో కంపౌండ్ ఫీజు కూడా విధిస్తారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు నిత్యం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు రాకపోకలు సాగిస్తున్నా రవాణా అధికారులకు కన్పించకపోవడం విడ్డూరంగా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఘోరాలు కొత్తవి కావు. 2013లో పాలెం వద్ద జరిగిన ప్రమాదంలో 45 మంది సజీవ దహనం. 2018లో కొండగట్టు దుర్ఘటనలో 57 మంది మృతులు. ప్రతి సారి కమిటీలు వేస్తాం, విచారణలు జరుగుతాయి, కానీ మారేది ఏమీలేదు. ఫలితం — మళ్లీ కొత్త ప్రమాదం, కొత్త ప్రాణనష్టం. ఈసారి కూడా అదే స్క్రిప్ట్ రిపీట్ అవుతుందా? ప్రభుత్వం రెండు రోజులు హడావుడి చేసి, ఆ తర్వాత మళ్లీ మామూళ్ల మత్తులోకి జారిపోతుందా? రవాణా శాఖలోని అవినీతి బంధం విచ్ఛిన్నం కానంతవరకు ప్రజల ప్రాణాలకు రక్షణ లేదు. ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియా ఇప్పుడు ప్రభుత్వాన్నే శాసించే స్థాయికి ఎదిగింది. కొందరు నేతలే బస్సుల యజమానులు కావడంతో, రాజకీయ ఒత్తిడులు అధికారులను కట్టిపడేస్తున్నాయి. ఏ సర్కారైనా ఈ దందాను ఎదుర్కొనే ధైర్యం చూపడం లేదు. ప్రజలు టికెట్ కొంటారు, భద్రత కొనలేరు. ఈ వ్యవస్థలోని అంధకారమే 20 ప్రాణాలను బలి తీసుకుంది. ఇది కేవలం ప్రమాదం కాదు — మన వ్యవస్థపై, మన నిర్లక్ష్యంపై వచ్చిన తీర్పు. ఇక ప్రశ్న మళ్లీ అదే — ఈ దారుణానికి బాధ్యులెవరు? ప్రజల ప్రాణాల కంటే మామూళ్లు విలువైన ఈ వ్యవస్థను ఎప్పుడు మేలుకొల్పుతాం?

> **"ప్రతినెలా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల నుంచి "హామీ"లు అందుతుండటంతో తనిఖీలు కాగితాలపై మాత్రమే జరుగుతున్నాయి. ఫిట్‌నెస్ లేకపోయినా, ఇన్సూరెన్స్ ముగిసినా, బస్సులు నగర వీధుల్లో దర్జాగా తిరుగుతుండటం దీని ప్రత్యక్ష నిదర్శనం.**

> **"ప్రతినెలా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల నుంచి "హామీ"లు అందుతుండటంతో తనిఖీలు కాగితాలపై మాత్రమే జరుగుతున్నాయి. ఫిట్‌నెస్ లేకపోయినా, ఇన్సూరెన్స్ ముగిసినా, బస్సులు నగర వీధుల్లో దర్జాగా తిరుగుతుండటం దీని ప్రత్యక్ష నిదర్శనం.**

> **"ప్రజలు టికెట్ కొంటారు, భద్రత కొనలేరు. ఈ వ్యవస్థలోని అంధకారమే 20 ప్రాణాలను బలి తీసుకుంది. ఇది కేవలం ప్రమాదం కాదు - మన వ్యవస్థపై, మన నిర్లక్ష్యంపై వచ్చిన తీర్పు. ప్రజల ప్రాణాల కంటే మామూళ్లు విలువైన ఈ వ్యవస్థను మేల్కొలపాల్సిన అవసరం ఉంది.**



# ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలి

### జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి

### అమ్మకు భరోసా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రతి నెలలో ఏదో ఒక రోజు "అమ్మకు భరోసా" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు... శనివారం నాడు యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని గుండ్లపల్లి కాలనీలో అమ్మకి భరోసా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మొదటి ప్రసవానికి సిద్ధంగా ఉన్న శ్రీమతి పూజిత భర్త భాషా గర్భిణీ స్త్రీ ని కలెక్టర్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గర్భిణీ స్త్రీ ఐన శ్రీమతి పూజిత తో ఆప్యాయంగా మాట్లాడి, ఆమె ఆరోగ్య పరిస్థితు లను అడిగి తెలుసుకున్నారు. సమయానికి భోజనం చేస్తున్నావా? మందులు వేసుకుంటున్నావా? అంటూ అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో శ్రద్ధ తీసుకోవాలని, సమయానికి ఆహారం తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండతాడని తెలిపారు. వారి కుటుంబ పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో మానసిక ఒత్తిడులు గురి కాకుండా ఉండాలని సూచించారు. పూజిత కు పోషకాహారాన్ని అందించేందుకు న్యూట్రిషన్ కిట్ ను అందజేశారు. ఆమె తో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకోవడం ఎంతో శ్రేయస్కరమని, పూర్తి స్థాయిలో అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని, ఎలాంటి ఖర్చులు లేకుండా ప్రసవం జరుగుతుందని అన్నారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సమయంలో తల్లి, బిడ్డకు అవసరమైన మందులు, టీకాలు ఉచితంగా అందించబడతాయని తెలిపారు. కాన్పు తర్వాత 102 వాహన సేవ ద్వారా తల్లిని బిడ్డతో కలిపి ఇంటి వద్ద దింపే సదుపాయం కూడా ఉందని వివరించారు. పోషకాహాలు కలిగిన మెంతికూర, తోటకూర, పుంటికూర వంటి ఆకుకూరలను పప్పుతో కలిపి వారానికి కనీసం రెండు సార్లు తినాలని చెప్పారు. అలాగే గ్లాస్ పాలు, కొబ్బరి ముక్కలు (ఎండినవి లేదా తాజా), పల్లీలు బెల్లంతో కలిపి, ఖర్జూరాలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు.హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నప్పుడు డాక్టర్ సూచన మేరకు ఐరన్ ట్యాబ్లెట్స్ లేదా ఇంజక్షన్ రూపంలో తీసుకోవడం సూచించారు.ఈ రకమైన ఆహారం ద్వారా గర్భిణికి శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుంది. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతారు అన్నారు. అలాగే కాన్పు అయిన తర్వాత ఒక గంటలోపు ముర్రు పాలను తప్పకుండా ఇవ్వాలనే అంశంపై కూడా గర్భిణికి అవగాహన కల్పించారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని తెలియజేశారు. అదేవిదంగా అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తరచూ గర్భిణుల ఇండ్లను సందర్శించి గర్భిణి స్త్రీల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని వారికీ తగిన సలహాలు మరియు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నిర్మూలనే పోలీసుల లక్ష్యం

### మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్



**మందమర్రి, మహా :** మందమర్రి సర్కిల్ పరిధిలో నేరాల నిర్మూలనే లక్ష్యమని స్థానిక సీఐ శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం రామగుండం సిపి, పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు, మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని యాపల్, అంగడి బజార్ ఏరియాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వాహన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందని వెల్లడించారు. అదేవిధంగా, ఒక బెల్ట్ షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 29.10 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ 19,897/ రూపాయల మేరకు ఉంటుందని స్పష్టం చేశారు. సదరు అక్రమ లిక్కర్ ఇంటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఉన్నాయనే అనుమానం ఉన్న ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని పేర్కొంటూ, గ్రామాలలో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎవరైనా కొత్త వారు ఇంటి అద్దెకు వస్తే వారికి సంబంధించిన పూర్తి సమాచారం తీసుకోవాలని చెప్పారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. మత్తుపదార్థాలైన గంజాయి సేవించడం వల్ల యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా లేదా అమ్మినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో ప్రజలకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కు కాల్ చేయాలని శశిధర్ రెడ్డి సూచించారు. ప్రజలు సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, దేవపూర్ ఎస్సై గంగారం, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, కాశీపేట ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి అదనపు ఎస్ఐ శ్రీనివాస్ మందమర్రి సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**భువనగిరి, మహా:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానములో 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 బాలుర స్టేట్ లెవెల్ వాలీబాల్ పోటీలకు ముఖ్య అతిధి గా తీన్మార్ మల్లన్న , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి లతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి 10 జిల్లాల క్రీడా కారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో MLC తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ క్రీడలు శరీర మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని అన్నారు విద్యార్థులు అందరు ఇలాంటి పోటీలలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, క్రీడారంగములో జిల్లాను ప్రధమస్థానములో నిలపాలని, క్రీడాకారులకు తనవంతు సహకారమునకు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అలసత్వం వహిస్తే ఉపేక్షించం

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మహా:** పనుల జాప్యం పై అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.కిచెన్ షెడ్ పనులు నత్తనడక నడుస్తున్నాయని వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ పై జిల్లా కలెక్టర్ హనుమంతరావు అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెడుతున్నారు లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. స్కూల్ ఆవరణలో పిచ్చి మొక్కలు ఉన్నాయి వెంటనే మొత్తం శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.కిచెన్ షెడ్ పనులు ఇంకా పూర్తి చేయకపోవడంపై పంచాయతీ రాజ్ ఏ.ఈ పై ఆగ్రహం వ్యక్తం చేస్తు వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.స్కూల్ గేటు కింద భాగంకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సంవత్సరం 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం 100% శాతం రావాలని , తదనుగుణంగా విద్యార్థులను ఒకటికి రెండుసార్లు చదివించాలన్నారు.ఇప్పటి నుండే చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని దత్తత తీసుకొని వారిని పది పరీక్షల్లో పాస్ అయ్యే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.ప్రతి విద్యార్థి పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయులు తగిన సూచనలు ఇవ్వాలన్నారు..





# అక్టోబర్ 27న ఏ4 మద్యం దుకాణాల కేటాయింపు

### మంచిర్యాల జిల్లా ఆబ్కారీ, మధ్య నిషేధశాఖ అధికారి నందగోపాల్

**మంచిర్యాల, మహా :** అక్టోబర్ 27న ఎ 4 మద్యం దుకాణాల కేటాయింపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆబ్కారీ, మధ్య నిషేధశాఖ అధికారి నందగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన మద్యం పాలసీ విధానం 2025 27 లో భాగంగా ఈ నెల 27వ ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ మండలం, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల పి.వి.ఆర్.గార్డెన్స్ లో ఎ4 మద్యం దుకాణాలకు కేటాయింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. దరఖాస్తుదారులు/ అదికృత వ్యక్తులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

# పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలి

### సింగరేణి ఎడ్యుకేషనల్ జి.ఎం.వెంకటాచారి



**మందమర్రి, మహా :** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ కంపెనీ కొత్తగూడెం ఎడ్యుకేషనల్ జి ఎం వెంకటాచారి, మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సింగరేణి పాఠశాలను వారు సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల గదులకు వెళ్లి పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి అనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించారు. పరీక్షల లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కాకుంటే అడిగి తెలుసుకోవాలని సూచించారు. అంతకుముందు పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణం యొక్క ఆవశ్యకత పై సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూశంకరయ్య, ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్, ఎస్టేట్స్ ఆఫీసర్ నవనీత, డి.వై.పి.ఎం ఆసిఫ్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సింగరేణి పాఠశాల హెడ్మాస్టర్ జె పురుషోత్తం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందజేసిన చిట్టేడి జనార్ధన్ రెడ్డి

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామానికి చెందిన కళ్లెం యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టేడి జనార్దన్ రెడ్డి శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో బండారు నరసింహారెడ్డి పోలేపాక చెమ్మయ్య బైకాని ముత్యాలు బండి రవికుమార్ ఆవుల స్వామి నిమ్మల రవికుమార్ రాజు ఎర్రగుట్ట కొప్పుల దాసు పండాల కుమార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి -ఎమ్మెల్యే





**భైంసా మహా:** విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో భైంసా మండలంలోని వటోలి గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ అంటేనే సామాజిక సేవ, అంకితభావం, క్రమశిక్షణ, నిస్వార్థ సేవ అన్నది ముఖ్య ఉద్దేశమని నాకోసం కాదు మీకోసం అన్న నినాదంతో స్వచ్ఛందంగా వాలంటీర్లు వివిధ గ్రామాలకు వెళ్లి సేవ చేయడం అనేటువంటిది అభినందనీయమని దీని ద్వారా విద్యార్థులు గ్రామాలలోని లోటుపాట్లను కనుగొంటూ వారిలో వివిధ అంశాల ద్వారా గ్రామాలలో అవగాహన కల్పించడం అనేది ప్రశంసించదగిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ ఎస్ ఎస్ కార్యకర్తలు వలంటీర్లు పాల్గొన్నారు.

# ఈ నెల 27న లాటరీ పద్ధతి ద్వారా ఏ4 మద్యం దుకాణాలు డ్రా

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** ఈ నెల 27 రాయగిరిలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో 202527 సంవత్సరానికి గాను A4 మద్యం దుకాణాలు లాటరీ పద్ధతిన తీయడం జరుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.... రాజేంద్రనగర్, రాయగిరి, భువనగిరి మున్సిపాలిటీ, యాదాద్రి భువనగిరి జిల్లా నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదగా జిల్లాకు సంబంధించిన (82) మద్యం దుకాణాలకు గాను (2776 )దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా డ్రా తీయబడునని కలెక్టర్ నేడోక ప్రకటనలో తెలిపారు. A4 మద్యం దుకాణాలకు సంబంధించి 202527 సంవత్సరానికి గాను మద్యం పాలసీలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు 27 సోమవారం నాడు ఉదయం 10 గంటల వరకు వేదిక వద్దకు రావాలని కలెక్టర్ తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన మంచిర్యాల జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు

### రెండు లక్షలు తీసుకుంటూ తన ఇంట్లో చిక్కిన అవినీతి అధికారి



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కి మంచిర్యాల జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు నాయక్ తన నివాసంలో శనివారం రెండు లక్షల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టిబడిన వైనం జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. ఒకవైపు అవినీతి ప్రభుత్వ అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టులు చేస్తూ జిల్లావ్యాప్తంగా హడలెత్తిస్తుంటే అవినీతి అధికారులు మాత్రం డోంట్ కేర్ అంటున్న చందంగా వ్యవహారాలు ఒకటొకటిగా బయటపడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... మంచిర్యాల జిల్లా సహకార శాఖ అధికారి బిక్కు నాయక్ కొమరం భీమ్ (ఆసిఫాబాద్) జిల్లాకు ఇన్చార్జి గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే బెజ్జూర్ పిఎసిఎస్ లో విధులు నిర్వహించిన మాజీ సీఈవో వెంకటేశ్వర్ గౌడ్ ను తిరిగి విధులలోకి తీసుకునేందుకు మంచిర్యాల జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు నాయక్ కార్యాలయంలో కలిసినట్లు తెలుస్తోంది. అందుకు గాను బిక్కు నాయక్ 7 లక్షల రూపాయలు డిమాండ్ చేసినట్లు సమాచారం. తన చేతిలో అంత డబ్బులు లేవు తర్వాత ఇస్తానని ఎంతగా చెప్పినా వినకపోవడంతో చివరికి బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. వారి సలహా మేరకు ఏడు లక్షల రూపాయలు రెండు దఫాలుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడవుతోంది. అందులో భాగంగా మొదటి దపాగ బాధితుడు రెండు లక్షల రూపాయలు మంచిర్యాల మున్సిపాలిటీ ఇక్బాల్ నగర్ లో అధికారి నివాసానికి వెళ్లి ఇస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా బిక్కు నాయక్ ను పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. కేసు సంబంధించిన పూర్వాపరాలు అధికారులు వెల్లడించవలసి ఉంది.



# సైబర్ మోసాల పట్ల జాగ్రత్త -ఎస్పీ

**ఆదిలాబాద్ మహా :** సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా ఏపీకే ఫైల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాట్సాప్ గ్రూపులలో పలు మోసపూరితమైన ఏపీకె ఫైల్స్ చక్కర్లు కొడుంటాయని వాటిని ఎట్టి పరిస్థితులలో ఓపెన్ చేయవద్దన్నారు. ఆర్థిక మెమోసాలకు గురయిన పుడు గోల్డెన్ అవర్ చాలా ముఖ్యమైనదని సైబర్ క్రైమ్ కు గురైన వెంటనే 1930 కి సంప్రదించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలకు అప్రమత్తతనే ప్రధాన అస్త్రమన్నారు. నకిలీ అప్లికేషన్ల ద్వారా డాటా చోరీ, సైబర్ క్రైమ్ జరిగే ఆస్కారముందన్నారు. సైబర్ క్రైమ్ లో వీఐపీల ఫేక్ ప్రొఫైల్స్ తో మోసం, జాబ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ మోసాల వంటివి చలామణిలో ఉన్న నేరాలు గా సూచించారు.వారంలో సైబర్ క్రైంకు సంబధించి 29 ఫిర్యాదుల స్వీకరించినట్లు తెలిపారు. ఆధునిక భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో పాటు ,ప్రజలను మోసగించే సైబర్ నేరాలు కూడా ఎన్నో రకాలుగా జరుగుతూ ప్రజల ఆర్థిక నష్టాలకు కారణమవుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తతో వ్యవహరించడం తప్పనిసరి అని తెలిపారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### బెల్లంపల్లి మెగా జాబ్ మేళా విచ్చేయండి.. నిరుద్యోగులకు బంగారు అవకాశం

### ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి



**బెల్లంపల్లి,మహా:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వలక్ష్యం అని బెల్లంపల్లి ఏఎంసీ మైదానంలో ఆదివారం నాడు జరగనున్న సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోని మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగామాట్లాడుతూ "ఉద్యోగం కోసం నగరాలు తిరిగే అవసరం లేదుఅని బెల్లంపల్లిలోనే వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు.ఈ మేళా తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ యువత ఉపాధి కోసం చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా నిర్వహించబడుతోందని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మనోజ్ ఐఏఎస్, సింగరేణి జీఎం రాధాకృష్ణ బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పాల్గొన్నారు.ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ "ఈ మేళాలో సుమారు 75 కంపెనీలు పాల్గొంటున్నాయని ఐటీ, మెడికల్, మైనింగ్, మార్కెటింగ్,ఎడ్యుకేషన్, సర్వీస్ రంగాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే సుమారు 9 వేల మంది నిరుద్యోగ యువకులు, యువతులు నమోదు చేసుకున్నారు" అని వివరించారు.సబ్ కలెక్టర్ మనోజ్ ఐఏఎస్ మాట్లాడుతూ "ప్రతి అభ్యర్థితన బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, అవసరమైన పత్రాలతో హాజరుకావాలనీ,నియామక సంస్థలు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తాయి" అని తెలిపారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ "సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా జాబ్ మేళా నిర్వహిస్తోందని స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.మేళా విజయవంతం కావడానికి స్థానిక అధికారులు, వాలంటీర్లు,కళాశాల ప్రిన్సిపాళ్లు,ఉద్యోగ విభాగ సిబ్బంది పర్యవేక్షణలో ఏర్పాట్లు జాగ్రత్తగా కొనసాగుతున్నాయని తెలిపారు. బెల్లంపల్లి ఏఎంసీ గ్రౌండ్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని ఈ సధవకాశాన్ని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని పాల్గొన్న అధికారులు సూచించారు.



# ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఫండ్స్

### సీఎంకు కంది శ్రీనివాస రెడ్డి ధన్యవాదాలు

**ఆదిలాబాద్:** రాష్ట్రం లోని మున్సిపాలిటీలలో రోడ్లు డ్రైనేజీలు మౌళిక సదుపాయాల కల్పన కోసం వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన 2780 కోట్ల నిధులలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ కి 15 కోట్ల నిధులు విడుదలయ్యాయి.గతంలో ఆయా మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృధి పనుల గురించి ప్రభుత్వం ప్రతిపాదనలు కోరగా ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 వార్డులకు సంబంధించి ప్రతీ వార్డులో చేపట్టాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీలు సహా పలు అభివృద్ధి పనుల కోసం నిధుల విడుదల గురించి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రతిపాదనలు పంపారు.దీంతో పాటు మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన మరిన్ని పనుల కోసం కూడా ఆయన నిధులకై ప్రతి పాదనలు పంపారు. దీంతో నిధులు విడుదల చేసిన సీయం రేవంత్ రెడ్డి కి కంది శ్రీనివాస రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలి



### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం జిల్లా కాలేజ్ రోడ్డులో నిర్మాణం అవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణం 129.25 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జైనూర్ లో పోలీసుల కార్డన్ సర్చ్

**జైనూర్ మహా :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం కేంద్రంలోని పవర్‌హౌస్ కాలనీలో సిఐ రమేష్ ,ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. వాహనాల తనిఖీలలో సరైన పత్రాలు లేని 60 వాహనాలు పెండింగ్ చలాన్లకు సంబందించి 18 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై వివరాలు సేకరించి విచారణ చేశారు.అదే సమయంలో నార్కోటిక్స్ మాదకద్రవ్యాల వినియోగం నివారణ, సైబర్ నేరాలు , రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తా..

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**గండిపేట, మహా:** రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే తన ధ్యేయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం గండిపేట మండలం నార్సింగ్ మున్సిపాలిటీ మంచిరేవులలో 9.55 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ మరియు సిసి రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక నియోజకవర్గంగా గుర్తింపు పొందడమే కాకుండా అభివృద్ధిలో కూడా అన్ని రంగాలలో ముందు అడుగు వేస్తుందన్నారు. అంతే కాకుండా నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రాజకీయ పార్టీలు, కులమతాలు అనే బేదం లేకుండా వాటికీ అతీతంగా అందరూ కలిసి మెలిసి ఒకే తాటిపై నడుస్తూ అభివృద్ధి కి సహకరించడం చాలా అభినందనీయం అని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో జనాభాకు అనుగుణంగా చేపట్టవలసిన మరిన్ని అభివృద్ధి పనులను కూడా దశలవారీగా చేపడతామని, ప్రజలు కూడా తమ తమ కాలనీలలో ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నార్సింగ్ మార్కెట్ చైర్మన్ కోటా వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, డిఈఈ నరేష్ కుమార్, ఏఈ శ్రీనివాస్, నర్సింగ్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ లపై వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు:కమిషనర్



**ఆమనగల్లు, మహా:** ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు.ఆమనగల్లు మాడుగుల రోడ్డు ఇటీవల విస్తరించారు. 60 ఫీట్ల రోడ్డును చిరు వ్యాపారులు ఆక్రమించుకోవడంతో రోడ్డు కుదించుకుపోయింది. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీలోని మాడ్గుల రహదారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణాలను తొలగించారు.ఫుట్‌పాత్‌కు ఇవతల తోపుడు బండ్లను పెట్టుకొని వ్యాపారాలు చేసుకోవాలే కానీ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం తగదన్నారు.రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలకు సంబంధించిన మెట్లు, షెడ్లపై దుకాణాలు పెడితే ఉపేక్షించేది లేదన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. హైదరాబాదు శ్రీశైలం జాతీయ రహదారి ఆనుకొని ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల దుకాణాలను పోలీస్ సహకారంతో తొలగిస్తామని.అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలనికోరారు. లేనిపో మున్సిపల్ చట్టం 2019 ప్రకారము చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

### ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ లు ఏర్పాటు చేయండి.. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా వెంటనే స్థలాల చుట్టూ ఫెన్సింగ్ (కంచెలు) ఏర్పాటు చేయాలని, ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను సూచించారు. శనివారం నగర పరిధి లోని గొర్రెకుంట కీర్తినగర్ కోటిలింగాల ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి శానిటేషన్ తో పాటు టౌన్ ప్లానింగ్ కు చెందిన అంశాలను పరిశీలించి సమగ్రవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సానిటేషన్ తనిఖీల తో పాటు ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఓపెన్ స్పేస్ ల గుర్తింపు కీర్తినగర్ ప్రాంతం లో మినీ సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ (నవీకరించిన క్యాంపాక్టర్ కు స్వచ్ఛ ఆటో నుండి నేరుగా చెత్త ను డంప్ చేసుకొని వెళ్ళడం)ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త నేరు గా సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ కు తరలించకుండా ఇంధనాన్ని సమయాన్ని ఆదా చేయడానికి మినీ సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఓపెన్ స్పేస్ లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వ ఓపెన్ స్పేస్ లో బయో కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని ముఖ్య ఆరోగ్యాధికారికి సూచించారు. గొర్రెకుంట ప్రాంతం లో పర్యటించిన క్రమం లో ఆక్రమణలను గమనించిన కమిషనర్ వాటిని తొలగించాలని ఇదే ప్రాంతం లో మరో చోట రోడ్డు ను ఆక్రమించడాన్ని పరిశీలించి ఆ ప్రాంతం లో డ్రైనేజ్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కీర్తినగర్ లో 4 ఓపెన్ స్పేసెస్ లలో ఇప్పటికే 2 ప్రాంతాల్లో ఫెన్సింగ్ చేసినందున మిగతా ప్రాంతాలకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ సంతోష్ బాబు, ఏ సి పి శ్రీనివాస్ రెడ్డి, డి ఈ సతీష్, టిపిఎస్ శ్రీకాంత్, టిపిబి ఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సులో ఆర్టీవో అధికారులు తనిఖీలు

### పలు బస్సులకు జరిమానాలు, మూడు బస్సులు సీజ్



**రాజేంద్రనగర్ , మహా :** కర్నూలు జిల్లాలో కావేరి ప్రైవేట్ బస్సు దుర్ఘటన నేపథ్యంలో, బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రవేట్ ట్రావెల్స్ బస్సులను ఆర్టీవో అధికారులు శనివారం శంషాబాద్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తొండుపల్లి టోల్గేట్ వద్ద రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ అధికారి సదానందం ఆదేశాల మేరకు ప్రైవేట్ బస్సులపై ఆర్టిఏ అధికారి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉపాసిని ఆధ్వర్యంలో తన సిబ్బందితో కలిసి పలు బస్సులపై కోరడా జూలీఫించారు. నిబంధనలు పాటించని పలు బస్సులకు జరిమానాలు విధించారు. మూడు ప్రైవేట్ బస్సుల పై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ప్రవేట్ ట్రావెల్స్ బస్సులు కనీస జాగ్రత్తలు పాటిస్తున్నారా లేదా తనిఖీల్లో భాగంగా తెలుసుకున్నారు. డ్రైవర్ తో పాటు మరో డ్రైవర్ ఉన్నాయి లేదా అనే వాటితో పాటు పలు బస్సుల డాక్యుమెంట్లును పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించి బస్సులు నడుపుతూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్




**రాజేంద్రనగర్, మహా :** సిఐటియు శంషాబాద్ మండల మహాసభను శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ శంషాబాద్ లో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికుల సమస్యలను సిఐటియు పరిష్కరించే ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతుంది. కనీస వేతనాలు ఉద్యోగ భద్రత ఈఎస్ఐపీఎఫ్ పర్మనెంట్ ఇన్సూరెన్స్ లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో భాగంగా నాలుగు కోడ్ తెచ్చింది ఈ కోడ్ లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కమిటీ 9 మందితో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిఐటియు మండల కన్వీనర్ గా నీరటి మల్లేష్ ను సిఐటియు సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేష్, ప్రవీణ్, నర్సింగ్ రావు, జయేందర్, ఇందిరా, సుజాత, శోభ, స్వప్న ,పవన్ కుమార్, రవి రావేలా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ

# అభివృద్ధి పనులు జరగాలి

### బస్తీ పర్యటనలో కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ భారత్ యూత్ క్లబ్ యువకుల ఫిర్యాదుతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన సిసి రోడ్లు, పెండింగ్లో ఉన్న పలు పనులపై జిహెచ్ఎంసి, హెచ్ ఎం డబ్ల్యు ఎస్, ఎస్ బి అధికారంతో కలిసి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులు సాంక్షన్ అయ్యి అర్ధార్థంగా ఆగిపోయిన, సిసి రోడ్ పనులు పునప్రారంభించబడ్డాయి. దాదాపు గగన్ పహాడ్ బస్తీలో రోడ్లు వేస్తారు. ఇంకా మిగిలి ఉన్న పలుచోట్లలో సెకండ్ ఫేస్ లో పనులు ప్రారంభమవుతాయన్నారు. నాణ్యత పాటిస్తూ ఎక్కడ రాజీ పడకుండా నాణ్యమైన రోడ్లు వేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమున్న చోట భూగర్భ డ్రైనేజీ నూతన పైప్ లైన్ కొరకు అధికారులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ యూత్ క్లబ్ కమిటీ సభ్యులు స్థానిక బస్తీ నాయకులు డివిజన్లోని ముఖ్య నాయకులు జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి, వర్కి ఇన్స్పెక్టర్ రాహుల్, హెచ్ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి , వినయ్ బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొట్టడంతో.. ఓ వ్యక్తి దుర్మరణం

### ఆదిభట్ల ఎస్ఐ సత్యనారాయణ వెల్లడి..



**రంగారెడ్డి జిల్లా మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదిభట్ల ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... రావిరాల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో, హన్మకొండ జిల్లాకు చెందిన బండారి వినోద్ (22), ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో తుక్కుగూడ వైపు తన మోటర్ సైకిల్ పై వెళ్తున్న క్రమంలో, స్కూల్ బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ, ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్ ను ఢీకొట్టడంతో ఘోరమైన ప్రమాదం జరిగిందన్నారు. దీంతో వినోద్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నగరంలోని ఉస్మానియా దవఖానకు తరలించడం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### రౌడీ షీటర్ల ఆగడాలకు

# అడ్డుకట్ట వేయాలి

### పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్, హన్మకొండ మహా;** డయల్ 100 ఫిర్యాదుల పై పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న కేసుల గురించి సమీక్ష జరపడంతో పాటు పెండింగ్ కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల పై కఠినంగా వ్యవహరిస్తూనే వారి కదలికలు, స్థితి గతుల పై నిఘా ఉంచాలని, గత కొద్ది కాలంగా రౌడీ షీటర్లు స్థానికంగా లేకుంటే, అతను ప్రస్తుతం నివాసం వుంటున్న ప్రాంతానికి చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చోరీలకు పాల్పడిన నిందితులతో పాటు, గంజాయి విక్రయాలకు పాల్పడే వారి పై హిస్టరీ షీట్లను తెరవాలని. సైబర్ నేరాల్లో కేవలం బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇప్పించడమే కాకుండా, నిందితుడిని పట్టుకొనేందుకు స్టేషన్ అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని, పోక్సో కేసుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలన్ని గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ అధికారిగా ఎస్ ఐ స్థాయి అధికారి తప్పకుండా విధులు నిర్వర్తించాలని, ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు తమ పరిధిలో పెండింగ్ లో వున్న ట్రాఫిక్ జరిమానాదారులకు ఫోన్ చేసి జరిమానా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ ఉన్న అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపోందించు కోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించోద్దని, నేరాల నియంత్రణ కై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాల ఏర్పాటు కై కృషి చేయడంతో సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని, గతంలో పోలీస్ స్టేషన్ పరిధిలో నేర చరిత్ర వున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో వుండాలని, ట్రాఫిక్ ఎన్ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి వుంటుందని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ లలో ఆహ్లాదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని ఇందుకోసం ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్ లో శ్రమదానం చేయాల్సి వుంటుందని సిపి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్,డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఏఎస్పీ చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి,తో పాటు ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

## డివిజన్‌లో విద్యుత్ పట్టణ బాట కార్యక్రమం

### పాల్గొన్న కార్పొరేటర్, విద్యుత్ అధికారులు




**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 22వ డివిజన్ లో విద్యుత్ పట్టణ బాట కార్యక్రమం లో భాగంగా స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ఆధ్వర్యంలో శాంతి నగర్ పోచమ్మమైదాన్ నందు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యుత్ భద్రతా సూత్రాలు విద్యుత్ పొదుపు సూచనలను శెంకేశి మల్లికార్జున్, ఎన్పీడీసీఎల్ డి.ఇ.ఇ వరంగల్ వినియోగదారులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలం చెల్లిన సర్వీసు వైర్ల ను సిబ్బంది చేత మార్చుకోవాలని, నాణ్యత కలిగిన విద్యుత్ పరికరాలను ఉపయోగించాలని వినియోగదారులకుసూచిస్తూ ప్రతి ఇంటిలో ఎర్తింగ్ తప్పకుండా చేసుకోవాలని విద్యుత్ వినియోగదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి సురేష్, ఏ.డి.ఇ, కే తిరుపతి, ఏఇ విద్యుత్ సిబ్బంది, శాంతి నగర్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు,బృందావన్ కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ

**వరంగల్ మహా;** 2025 27 సంవత్సరాలకు వరంగల్ రూరల్ జిల్లా లోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ తేదీ 23.10.2025 న ముగిసింది. వరంగల్ రూరల్ జిల్లాలోని మొత్తం 57 మద్యం షాపులకు గాను 1958 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తుల ఫీజు రూపంలో 60 కోట్ల వరకు ఆదాయం ఆర్జించడం జరిగింది . ఈ సందర్భంగా తేదీ 27.10.2025 సోమవారం మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను వరంగల్ పట్టణంలోని ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో వరంగల్ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద సమక్షంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి వరంగల్ రూరల్ జిల్లాలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్ రెప్రెసెంటేటివ్ తేదీ 27.10.2025 సోమవారం ఉదయం 9.30 గంటల వరకు నాని గార్డెన్స్ లో వారికి కేటాయించిన సీట్లలో హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చిన రిసిప్ట్ తో పాటు ఎంట్రీ పాస్ ఒరిజినల్స్ ను తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

## వైభవోపేతంగా కార్తీక దీపోత్సవం

### దేవాదాయ శాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం



**వరంగల్ మహా;** పవిత్ర కార్తీక మాసంలో కార్తీక మాసోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించాలని రాష్ట్రంలోని ప్రతి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో వైభవోపేతంగా అలకరించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ సంవత్సరం కార్తీక దీపోత్సవం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 19 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు శైలజ రామయ్యర్, హరీష్, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంటు కమిషనర్లు, ఈవోలతో శనివారం మంత్రి కొండా సురేఖ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల ఈవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కార్తీక మాసం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని గుర్తు చేశారు. ఈ కార్తీక మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదంగా ఉంటుందని అన్నారు. సామూహిక కార్తీక దీపోత్సవం అంటే అందరూ కలిసి దేవాలయ ప్రాంగణములో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చేయాలని సూచించారు. గతంలో నిర్వహించినట్లుగా ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించుటకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవం సాయంత్రం 6 గంటల నుంచి జరపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటుగా పసుపు కుంకుమ తాంబూలాలను అందచేస్తున్నట్టు వివరించారు. కార్తీక సోమవారం నాడు సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతో పాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, ఏదైనా పండు, కనుము ప్రధాన దేవాలయలలో భక్తులకు ఇస్తున్నట్టు తెలిపారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు దీపాలు ఒదలటానికి అవసరమైన చోట తాత్కాలిక వాటర్ పాండ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నదీ పరివాహక ప్రాంతాలలోని దేవాలయాలలో నది హారతి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తుల కొరకై బ్రహ్మశ్రీ నాగఫణిశర్మ, శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ చే ప్రముఖ దేవాలయాల్లో ప్రవచనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నివేదించారు.

### భూభారతి దరఖాస్తులను

# త్వరగా పరిష్కరించాలి



### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా చొరవ చూపాలని, దరఖాస్తుల పరిశీలనలో అధికారులు జాప్యానికి తావు లేకుండా వెంటనే అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డి ఆర్ ఓ విజయలక్ష్మి, తో కలసి వర్ధన్నపేట తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి మండలంలోని తహసిల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి అమలు పై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు ? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి? ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా..? లేదా అనే వివరాలను తహసిల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన ను వేగవంతం చేసి నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ.. వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి సకాలంలో సర్టిఫికెట్లు ప్రజలకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ యస్ పాయింట్ ద్వారా ప్రజలకు బియ్యం, నిత్యావసర సరుకులు వంటివి సరైన నాణ్యతతో, సరైన బరువుతో సరఫరా అవుతున్నాయో లేదో ఆకస్మిక తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని డి ఎస్ ఓ, పౌర సరఫరాల డిఎం , తహశీల్దారు లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో తహశీల్దార్ విజయ్ సాగర్, నాయబ్ తహసీల్దార్ వినయెందర్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బేకరీలలో కాలం చెల్లిన ఆహార పదార్థాల అమ్మకం

### బేకరి పై కొరడా ఝులిపించిన టాస్క్ ఫోర్స్

ఎలాంటి లైసెన్సు లేకుండా కాలం చెల్లిన కూల్ కేక్ క్రీమ్ బాటిల్ ఫ్లేవర్స్ కేక్ కలర్స్ తో పాటు ఎలాంటి ఎక్స్పైరీ డేటు లేనటువంటి బేకరీ ఉత్పత్తులను ఉపయోగిస్తున్న బేకరి కంపెనీ పై ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝులిపించారు. వివరాల్లోకెళ్తే.. కిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని ఖజూర్ బెంగళూరు బేకరీ లో కాలం చెల్లిన బేకరీ పదార్థాలు, దాదాపు 15 రకాల ఆహార వస్తువులను సుమారు 11,005 రూపాయలు / విలువ గల ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ విషయంలో నాణ్యత,పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్న వ్యాపారస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలనే వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల ప్రకారం , టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూదన్ ఆధ్వర్యం లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి బాబులాల్, ఎస్సై వి దిలీప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి సంయుక్తంగా కలిసి వరంగల్ లోని కిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపం లో నడుపుతున్న ఖజూర్ బెంగళూరు బేకరి ప్రొడక్ట్స్ అను కంపెనీ పై దాడి చేసి అమ్మడానికి సిద్ధంగా ఉన్న కాలం చెల్లి పాడై పోయిన బేకరీ ఫుడ్స్ తో పాటు బేకరీ యజమాని నిందితుడు ఎండి అనీఫ్, తండ్రి పేరు అబ్దుల్ మజీద్, వయసు 48, కులం ముస్లిం, నివాసం ఇనెం 457 1574, కిలా వరంగల్ పెట్రోల్ బంక్ దగ్గర వారిని విచారణ నిమిత్తం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కు అప్పగించడం జరిగింది.

### వ్యాపారస్తులకు పోలీస్ వారి హెచ్చరిక

ఆహార భద్రత విషయంలో ప్రభుత్వ లైసెన్సు లేకుండా అపరిశుభ్రంగా, కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయించిన, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారుల పై కఠిన చర్యలు తప్పవని, ప్రముఖ బ్రాండ్‌లను మార్పు చేసి విక్రయాలు చేస్తున్న నకిలీ వస్తువుల పై నిఘా ఉంచామని గడువు ముగిసిన, పాడై పోయిన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006, 2011 రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం నిబంధనలు పాటించని ఫుడ్ సేఫ్టీ శాఖ సహాయంతో వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ జి బాబులాల్ హెచ్చరించారు.



# రాజీపడితేనే సొంతిల్లు.. లేదంటే సవాలే!

**“ విషయం ఏదైనా సరే.. కోరుకున్నవన్నీ దొరక్కపోవచ్చు. ఏదో ఒక విషయంలో రాజీ పడక తప్పదు. ఇళ్ల కొనుగోలుకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బడ్జెట్, చిక్కుల్లేని యాజమాన్య హక్కు, ప్రాంతం, వాస్తు, నీరు, విద్యుత్తు సరఫరా అంశాలు ఇంటి కొనుగోలు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే వీటిలో కొన్ని అంశాలు మనం ఆశించినట్లు ఉండకపోవచ్చు. అన్నీ మనకు అనుకూలంగా ఉండాలంటే సొంతింటి స్వప్నం ఓ పెద్ద సవాలే అవుతుంది. అలాగనీ ముఖ్యమైన అంశాల్లోనూ రాజీ పడాలని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఒకటి, రెండు అనుకూలంగా ఉండకపోవచ్చు. కాబట్టి ఏయే విషయాల్లో రాజీ పడొచ్చు.. ఎక్కడ పడకూడదో స్పష్టత ఏర్పర్చుకోవాలి**

ఇల్లు కొనాలన్న ఆలోచనలో ఉన్నారా? అది కూడా మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అనుకుంటున్నారా? ఇక్కడ వీలవ్వకపోతే మియాపూర్, మదీనాగూడ, మణికొండ, ఓయూ కాలనీ తదితర ప్రాంతాల్లో.. కొంచెం తక్కువ ధరలో దొరికే ప్రాంతాలపై దృష్టి పెడతారు అవునా? ప్రస్తుత రియల్టీ మార్కెట్లో సంపన్నులకే కాదు మధ్యతరగతి, సామాన్యులు.. ఇలా వివిధ వర్గాల వారికి స్థోమతకు తగ్గ బడ్జెట్‌లో నగరం చుట్టూ గృహసముదాయాలు వస్తున్నాయి. మీరు కొంచెం కసరత్తు చేసి, చుట్టుపక్కల ప్రాంతాల్ని అన్వేషిస్తే చాలు, మీకు అందుబాటు ధరలో ఇల్లు ఎక్కడ దొరికేది ఇట్టే తెలిసిపోతుంది.

**సదుపాయాల సంగతేంటి?**

నిర్మాణాల విషయంలో డెవలపర్ల వ్యూహం మారింది. సకల సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇల్లు కొనాలన్న నిర్ణయానికొచ్చాక సదుపాయాల సంగతి కూడా ఆలోచించాలి. క్లబ్‌హౌజ్, జిమ్ అవసరమా? వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే ఈ సదుపాయాలు అక్కర్లేదా? అన్నది తేల్చుకోవాలి. జీవనశైలి, బడ్జెట్ తదితర అంశాలు మీ నిర్ణయంపై ప్రభావితం చేస్తాయి. కాబట్టి సదుపాయాల విషయంలో స్పష్టత ఉండాలి.

**బిల్డర్‌కు మంచి పేరుందా?**

స్థిరాస్తి కొనేటప్పుడు బిల్డర్ గురించి కూడా ఆరా తీయాలి. మార్కెట్లో పేరున్న బిల్డర్లు నిర్మించే ఇళ్లకే ప్రాధాన్యమివ్వాలి. గతంలో అతను నిర్మించిన ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యాయా? నిర్మాణం ఎలా ఉంది? ఒప్పందం మేరకు కొనుగోలుదారులకు సదుపాయాలు కల్పించాడా? కార్పస్ ఫండ్ బదిలీలో ఇబ్బందులేమైనా సృష్టించాడా? అన్న విషయాల్ని తెలుసుకోవాలి. నిర్మాణాల్లో మంచి చరిత్ర లేని బిల్డర్లకు దూరంగా ఉండటమే మేలు. అలాగనీ మార్కెట్లో పేరున్న బిల్డర్ల ప్రాజెక్టులకే పరిమితం కానక్కర్లేదు. నిర్మాణంలో నాణ్యత పాటించి ఒప్పందానికి కట్టుబడి ఉండేవారిని ఎంచుకోవచ్చు.

**పరిసరాలెలా ఉన్నాయి?**

ఇంటి ముందు పచ్చటి తోటతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని కొందరు కోరుకుంటారు. మరికొందరేమో ఇలాంటి హంగులు లేకున్నా సర్దుకుపోతారు. బాల్కనీని పచ్చగా, అందంగా అలంకరించుకుంటే గార్డెన్‌కు దీటుగా ఉంటుందని భావిస్తారు. కాబట్టి ఈ విషయంలో మీ దృక్పథం ఏమిటో నిర్ణయించుకోవాలి.





## 2030 నాటికి రూ.2 లక్షల కోట్లు!: అనరాక్ రీసెర్చ్

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) పెట్టుబడులలో కార్యాలయ విభాగం అగ్రగామిగా ఉంటుంది. అయితే కొంత కాలంగా రీట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ క్రమంగా రిటైల్ విభాగంలో కూడా వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ మాల్స్, సెంటర్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్ట్‌లలో రీట్స్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. నాణ్యమైన రిటైల్ స్పేస్ అందుబాటులోకి వస్తుండటం, కొనుగోలుదారుల వ్యయం పెరగడం, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధి, స్థిరమైన ఆదాయ వనరుగా మారడం వంటివి రిటైల్ రంగంలో రీట్స్ పెట్టుబడులకు ప్రధాన కారణాలని అనరాక్ రీసెర్చ్ నివేదిక తెలిపింది. దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 2030 నాటికి దేశీయ రిట్స్ రూ.2 లక్షల కోట్లకు చేరుతాయని అనరాక్ రీసెర్చ్ అంచనా వేసింది. ఇందులో 3040 శాతం వాటా రిటైల్ రంగానిదే ఉంటుందని తెలిపింది. 2030 నాటికి రిటైల్ రీట్స్ రూ.60-80 వేల కోట్లుగా ఉంటాయని పేర్కొంది.

**ఆదాయ వనరుగా..**

గ్రేడ్-ఏ షాపింగ్ మాల్స్ స్థిరమైన ఆదాయ వనరుగా మారడంతో పెట్టుబడిదారులు రిటైల్ విభాగంలో రీట్స్ పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. వచ్చే 3-5 ఏళ్లలో 2-3 రిటైల్ రీట్స్ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయని తెలిపింది. ప్రస్తుతం ఐదు రిటైల్ రీట్స్ నమోదు కాగా.. ఇందులో నెక్సస్ ఒక్కటే రిటైల్ కేంద్రీకృత రీట్స్ కాగా.. మిగిలిన నాలుగు కార్యాలయ కేంద్రీకృత రీట్స్. కొత్త షాపింగ్ మాల్స్‌లో సగానికి పైగా స్థలం రిటైల్ కేంద్రాలే ఉంటున్నాయి. ద్వితీయ శ్రేణి పట్టణాలలో సంస్థాగత పెట్టుబడులు వస్తుండటంతో రీట్స్ పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఫీనిక్స్ మైల్స్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, నెక్సస్ మాల్స్ వంటి ప్రధాన సంస్థలు ఇండోర్, కోయంబత్తూరు, సూరత్, భువనేశ్వర్, చండీఘడ్ వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలలో శరవేగంగా విస్తరిస్తున్నాయి.

## రైల్వే బోర్డు కీలక నిర్ణయం: తక్షణమే అమల్లోకి..

దేశంలో పెరుగుతున్న మధుమేహ రోగుల సంఖ్యకు దృష్టిలో ఉంచుకుని.. రైల్వే బోర్డు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం రైళ్లకు టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు, మీకు డయాబెటిక్ ఆహారం అవసరమని ముందుగానే సూచించవచ్చు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని రైల్వే బోర్డు వెల్లడించింది. రైల్వే బోర్డు సీనియర్ అధికారి దీని గురించి మాట్లాడుతూ, అన్ని ప్రీపెయిడ్ రైళ్లు ఇప్పుడు ఐదు రకాల ఆహార ఎంపికలను అందిస్తాయని తెలిపారు. అవి శాఖాహారం, మాంసాహారం, జైన్ భోజనం, డయాబెటిక్ శాఖాహారం, డయాబెటిక్ మాంసాహారం. దీని అర్థం డయాబెటిస్ ఉన్నవారికి శాఖాహారం & మాంసాహారం రెండూ ఉంటాయి. భారతదేశంలో.. ప్రతి సంవత్సరం సగటున 1.6 మిలియన్ల మంది డయాబెటిస్ కారణంగా మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. రాజధాని ఎక్స్‌ప్రెస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్, దురంతో ఎక్స్‌ప్రెస్.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఆహార ఎంపికలను విస్తరించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది.

**మధుమేహ రాజధానిగా భారత్!**

భారతదేశం ప్రస్తుతం ప్రపంచ మధుమేహ రాజధానిగా గుర్తింపు పొందుతోంది. ఇక్కడ దాదాపు 220 మిలియన్ల మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కాగా ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గతంలో వృద్ధులు మాత్రమే ఈ వ్యాధితో బాధపడేవారు. కానీ ఇప్పుడు యువకులు కూడా పెద్ద సంఖ్యలో దీనికి బలైపోతున్నారు. ది లాన్సెట్ 2023 నివేదిక ప్రకారం.. భారతదేశంలో 212 మిలియన్ల మంది డయాబెటిక్ రోగులు ఉన్నారు. ఈ సంఖ్య చైనాలో 149 మిలియన్లు, యునైటెడ్ స్టేట్స్‌లో కేవలం 42 మిలియన్లు మాత్రమే. దీని అర్థం చైనా & యునైటెడ్ స్టేట్స్ రెండింటి సంఖ్యలను కలిపినా, మొత్తం ఇప్పటికీ 191 మిలియన్లుగానే ఉంది. ఒక్క భారతదేశంలో మాత్రమే 210 మిలియన్లకు పైగా డయాబెటిక్ రోగులు ఉన్నారు.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# రష్యా చమురు.. ఏకాకిగా భారత్?

అంతర్జాతీయ వాణిజ్యంలో సమానత్వం అవసరమని, ఒకే రకమైన పరిస్థితుల్లో ఉన్న దేశాలకు వేర్వేరు నిబంధనలు వర్తింపజేయడం అన్యాయమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. రష్యా చమురు విషయంలో భారత్‌పైనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి చేస్తుండడం గురించి ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో భారత్ ఏకాకిగా మారిందంటూ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ద్వైపాక్షిక్ష చర్చల్లో భాగంగా జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన బెర్లిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ‘‘ఈ రోజు పేపర్‌లో చూశాను. ముడి చమురు కొనుగోలు విషయంలో ఆంక్షల నుంచి మినహాయించాలని జర్మనీ కోరినట్టు అందులో ఉంది. యూకే ఇప్పటికే అమెరికా నుంచి చమురు కొనుగోలు పరంగా మినహాయింపు పొందింది. అలాంటప్పుడు భారత్‌నే ఎందుకు లక్ష్యం చేసుకుంటున్నారు?.. అని మంత్రి అన్నారాయన. ఇదిలా ఉంటే.. రష్యా చమురు కంపెనీలైన రోజ్‌నెఫ్ట్, ల్యూక్ ఆయిల్‌తో ఎవరూ వ్యాపార లావాదేవీలు నిర్వహించరాదంటూ ఈ నెల 22న అమెరికా ఆంక్షలు ప్రకటించింది. అయితే ఈ తరహా సుంకాలు అనుచితం, అన్యాయం, అసమంజసమని భారత్ తరపున గోయల్ మరోసారి స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాతో భారత్ జరిపే చమురు వాణిజ్యం వల్లే నిధులు సమకూరుతున్నాయని.. తక్షణమే ఆ కొనుగోళ్లను ఆపేయాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే పెనాల్టీ టారిఫ్‌లు విధించిన ఆయన.. ఆపకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ వచ్చారు. అయినప్పటికీ భారత్ మాత్రం జాతి ప్రయోజనాలు తప్పించి.. మరే ఇతర కోణంలోనూ నిర్ణయాలు తీసుకోబోదని స్పష్టం చేసింది. అయితే.. మోదీ తనకు మంచి మిత్రుడని, రష్యా కొనుగోళ్లను ఆపేస్తానని హామీ ఇచ్చారని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. భారత్ ఈ ప్రకటనను ఖండించింది. ఆ వెంటనే ఆయన స్వరం మారింది. వైట్‌హౌజ్ దీపావళి వేడుకల్లో మాట్లాడుతూ.. భారీగా కొనుగోళ్లను జరపబోదంటూ మరో ప్రకటన చేసేశారు. అదే సమయంలో.. ఇండియాఅమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కూడా ఓ కొలిక్కి రాబోతోందని తెలిపారు. రష్యా నుంచి ముడి చమురును నిలిపివేయాలంటూ అమెరికా ఒత్తిళ్లు తీసుకువస్తున్న వేళ.. మంత్రి పీయూష్ గోయల్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యం నెలకొంది.






## మహిళ వేషంలో బిన్ లాడెన్..

### మాజీ సీఐఏ అధికారి వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు సంబంధించిన ఒక వార్త ఇప్పుడు సంచలంగా మారింది. 2001, సెప్టెంబర్ 11 ఉగ్ర దాడులతో అమెరికాకు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా మారిన అల్ ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్.. మహిళ వేషంలో టోరా బోరా కొండల నుండి తప్పించుకున్నాడని కేంద్ర నిఘా సంస్థ(సీఐఏ) మాజీ అధికారి జాన్ కిరియాకౌ తాజాగా వెల్లడించారు. 2001లో టోరా బోరా కొండలలో అమెరికా దళాలు ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించినప్పుడు, అతడు మహిళా వేషం ధరించి అక్కడి నుంచి తప్పించుకున్నాడని తెలిపారు.

జాన్ కిరియాకౌ ఏఎన్‌ఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా సైన్యంలో రహస్యంగా చొరబడిన అల్ ఖైదా కార్యకర్త సహాయంతో ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్.. మహిళ వేషం వేసుకుని, టోరా బోరా నుంచి తప్పించుకున్నాడని తెలిపారు. సీఐఏలో 15 ఏళ్లు పనిచేసి, పాకిస్తాన్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు నాయకత్వం వహించిన కిరియాకౌ, అమెరికాలో సైనిక శ్రేణుల్లో అల్ ఖైదా కార్యకర్తల చొరబాట్లను తెలియజేశారు. 9/11 దాడుల అనంతరం అమెరికా సంయమనంగా వ్యవహరించింది, ఆఫ్ఘనిస్తాన్‌లో బాంబు దాడులను చేపట్టేందుకు నెల్లాళ్లు వేచివుందన్నారు. ఈ తరుణంలోనే అల్ ఖైదా చొరబాటుదారునిగా తేలిన అనువాదకుడు ఉగ్రవాది బిన్ లాడెన్ తప్పించుకునేందుకు అవకాశం కల్పించాడని తెలిపారు.

లాడెన్ తప్పించుకున్న ఘటన దరిమిలా యూఎస్ ఉగ్రవాద నిరోధక దృష్టి పాకిస్తాన్ వైపు మళ్లిందని జాన్ కిరియాకౌ తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌తో చర్చలు జరిగాయని, అతను అమెరికా నుంచి ఆర్థిక, సైనిక సహాయానికి బదులుగా దేశంలోకి యూఎస్ కార్యకలాపాలను అనుమతించాడని పేర్కొన్నారు. అదే సమయంలో సీఐఏ పాకిస్తాన్ గ్రూప్ లష్కరే తోయిబా, అల్‌ఖైదా మధ్య గల సంబంధాలను గుర్తించిందన్నారు. ఇది అమెరికా నిఘా వ్యవహారాల్లో మైలురాయిగా నిలిచిందన్నారు.

భారత్‌పాక్‌ల గురించి మాట్లాడిన జాన్ కిరియాకౌ 2002లో భారతదేశం పాకిస్తాన్ మధ్య యుద్ధం వస్తుందని అమెరికా నిఘా సంస్థలు భయపడ్డాయని, పార్లమెంట్ దాడి, ఆపరేషన్ పరాక్రమ్ సమయంలో పెరిగిన ఉద్రిక్తతలే దీనికి కారణమన్నారు. నాడు అమెరికా ఈ ముప్పును తీవ్రంగా పరిగణించిందని, అందుకే ఇస్లామాబాద్ నుండి అమెరికన్ కుటుంబాలను ఖాళీ చేయించామని అన్నారు. ఆ సమయంలో వాషింగ్టన్ దృష్టి అల్ ఖైదా, ఆఫ్ఘనిస్తాన్‌పైననే ఉందని, అందుకే భారతదేశ ఆందోళనలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదని ఆయన వివరించారు. 2008 ముంబై దాడుల గురించి కిరియాకౌ మాట్లాడుతూ ఈ దాడుల వెనుక పాకిస్తాన్ మద్దతు కలిగిన కశ్మీరీ ఉగ్రవాద గ్రూపుల హస్తం ఉందని అమెరికా నిఘా సంస్థలు భావించాయన్నారు. పాకిస్తాన్.. భారతదేశంలో ఉగ్రవాదాన్ని వ్యాపింపజేస్తోందని ఆయన అన్నారు. పార్లమెంట్, ముంబై దాడుల తర్వాత భారత్ సంయమనం పాటించిందని, అయితే ఇప్పుడు భారత్ వ్యూహాత్మక సహనాన్ని కలిగి ఉండలేని స్థితిలో ఉందని ఆయన అన్నారు. ఎప్పుడు యుద్ధం వచ్చినా, భారత్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోతుందని ఆయన కిరియాకౌ హెచ్చరించారు. నిరంతరం భారతీయులను రెచ్చగొట్టడంలో అర్థం లేదని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, 2011 మే 2న అమెరికా నేవీ సీల్ టీమ్ 6 పాకిస్తాన్‌లోని అబోటాబాద్‌లో బిన్ లాడెన్‌ను హతమార్చినట్లు అధికారికంగా ప్రకటించబడింది. కేవలం 2001లో అమెరికా పట్టుకునేందుకు యత్నించిన సమయంలో లాడెన్ తప్పించుకున్నాడనేది మాజీ సీఐఏ అధికారి వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది.

## కరీబియన్ జలాల్లో అమెరికా మళ్లీ దాడి

**ఆరుగురు మృతి.. వెనిజులా డ్రగ్స్ ముఠా సభ్యులన్న హెగ్సెత్**



వాషింగ్టన్: కరీబియన్ సముద్ర జలాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఓ బోటుపై చేపట్టిన వైమానిక దాడిలో ఆరుగురు చనిపోయారని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ శుక్రవారం తెలిపారు. వీరంతా వెనిజులా జైలు నుంచి నడుస్తున్న ట్రెన్ డె అరాగ్వా గ్యాంగ్‌కు చెందిన వారేనన్నారు. ఈ ప్రాంతంలోని నార్కో-టెర్రరిస్ట్ డ్రగ్స్ రవాణాదారులను అల్‌ఖైదా ఉగ్రవాదులుగానే భావిస్తామన్నారు. వారిని వెంటాడి వేటాడి చంపుతామని హెగ్సెత్ హెచ్చరించారు. తాజా ఘటనతో సెపెటంబర్ నుంచి ఆ ప్రాంతంలో అమెరికా చేపట్టిన దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య 43కు చేరుకుంది. ఇలా ఉండగా, దక్షిణ అమెరికా ప్రాంతంలోకి విమాన వాహక నౌకను పంపిస్తున్నట్లు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. గురువారం అమెరికా సైనిక సూపర్‌సోనిక్ హెవీ బాంబర్లు రెండు వెనిజులా తీరం వెంబడి చక్కర్లు కొట్టాయి. కరీబియన్ సముద్రం, వెనిజులా తీర వెంబడి అమెరికా బలగాల అసాధారణ మోహరింపులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో నార్కో టెర్రరిజమ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను గద్దె దించే లక్ష్యంతోనే ఇవన్నీ చోటుచేసుకుంటున్నట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. డ్రగ్స్ రవాణా ఒక కారణం మాత్రమే కాగా, ఆయా దేశాలను బెదిరించి దారికి తెచ్చుకోవడమే అమెరికా అసలు లక్ష్యమని పరిశీలకులు అంటున్నారు.




## ఇమ్రాన్ సోదరి పాస్‌పోర్టుపై నిషేధం

**లాహోర్:** జైలులో ఉన్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్ పాస్‌పోర్టు, గుర్తింపు కార్డు, బ్యాంకు అకౌంట్‌లను సీజ్ చేయాలని రావల్పిండిలోని ఉగ్రవాద నిరోధక కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నాన్ బెయిలబుల్ వారెంట్లతో ఉగ్రవాద ఆరోపణలను ఎదుర్కొంటున్న అలీమా ఖాన్ విచారణకు రావాలంటూ పదేపదే పంపుతున్న నోటీసులను పట్టించుకోనందునే ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు కోర్టు తెలిపింది. అయితే, ఇతర కార్యక్రమాలు ఎక్కడున్నా తప్పకుండా హాజరయ్యే అలీమా ఖాన్..కోర్టుకు మాత్రం ఎందుకు రావడం లేదని విచారణ సందర్భంగా జడ్జి అంజాద్ అలీ షా ప్రశ్నించారు. కేసు విచారణను తదుపరి ఈ నెల 27వ తేదీకి వాయిదా వేస్తున్నామని, ఈ దఫా ఆమెను తప్పకుండా కోర్టులో హాజరుపర్చాలని అధికారులను ఆదేశించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 26-10-2025
ANN తెలుగు

# మరో సీక్వెల్‌లో ప్రభాస్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ షెడ్యూల్ ఇప్పుడు చాలా బిజీగా ఉంది. ఆయన నటించిన ది రాజాసాబ్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. మరోవైపు హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' సినిమా చేస్తున్నాడు. దీంతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ చేయబోతున్నాడు. మరోవైపు సలార్, కల్కి చిత్రాలకు సీక్వెల్స్ కూడా చేయబోతున్నాడు. ఇంత బిజీగా ఉన్న ప్రభాస్.. తాజాగా మరో సీక్వెల్‌కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అదే ది రాజాసాబ్ 2.

## మారుతి స్టైల్ నచ్చి..

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ 'ది రాజాసాబ్'(The Raja Saab) సినిమా చేశాడు. ఇప్పటికే షూటింగ్ అంతా కంప్లీట్ అయిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని గతంలో వార్తలు వచ్చాయి. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కూడా సీక్వెల్‌పై స్పష్టత ఇచ్చాడు. 'రాజాసాబ్ 2' ఉంటుందని.. కాకపోతే ఇది తొలి భాగానికి కొనసాగింపులా ఉండదని.. థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయని ఓ ప్రెస్‌మీట్‌లో ఆయన చెప్పారు. అయితే అప్పటికీ మారుతి కథ సిద్ధం చేయలేదు. కానీ ప్రభాస్ మాత్రం మారుతితో మరోసారి పని చేయడానికి ఆసక్తి చూపించాడట. దీంతో మారుతి ఇటీవల రాజాసాబ్ 2 స్టోరీకి సంబంధించిన లైన్‌ని ప్రభాస్‌కి చెప్పాడట. అది బాగా నచ్చడంతో 'చేసేద్దాం డార్లింగ్'అని ప్రభాస్ చెప్పినట్లు సమాచారం.

## రెండేళ్ల వరకు ఆగాల్సిందే..

ప్రభాస్ ఇప్పుడు ఫౌజీ షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ కాగానే..వెంటనే 'స్పిరిట్'చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లబోతున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందట. ఆ తర్వాత సలార్ 2 లేదా కల్కి 2 చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలి. ఇవన్నీ పూర్తయ్యేవరకు దాదాపు రెండేళ్లు పడుతుంది. ఆ తర్వాతే ప్రభాస్ మరో కొత్త సినిమాని ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ నిజంగానే రాజాసాబ్ సీక్వెల్ ఉన్నా.. రెండేళ్ల తర్వాత దాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రభాస్‌తో సినిమా కాబట్టి మారుతి కచ్చితంగా ఆగుతాడు. అందులో నో డౌట్. ది రాజాసాబ్ రిలీజ్ తర్వాత రిజల్ట్‌ని బట్టి పార్ట్ 2 ఉంటుందా లేదా అనేది క్లారిటీ వస్తుంది.



# రిషభ్ శెట్టి ఫ్యామిలీ సెలబ్రేషన్స్..

మూడేళ్ల క్రితం సెన్సేషన్ సృష్టించి, రీసెంట్‌గా మరోసారి పాన్ ఇండియా లెవల్లో రచ్చ చేసిన హీరో రిషభ్ శెట్టి. 2022లో వచ్చిన 'కాంతార'తో గుర్తింపు తెచ్చుకున్న ఇతడు.. కొన్నాళ్ల క్రితం వచ్చిన 'కాంతార 1'తో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. రూ.800 కోట్ల మార్క్ దాటి ప్రస్తుతం రూ.1000 కోట్ల కలెక్షన్స్‌కి చేరువలో ఉంది. సరే ఇదంతా పక్కనబెడితే తాజాగా రిషభ్.. కుందాపురలోని తన ఇంట్లో దీపావళిని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఆ ఫొటోలు ఇప్పుడు బయటకు రాగా అందులోని ఓ విషయం ఆసక్తికరంగా అనిపించింది. వాటర్ క్యాన్ బిజినెస్‌తో కెరీర్ మొదలుపెట్టిన రిషభ్ శెట్టి.. తర్వాత సినిమాల్లోకి వచ్చాడు. తొలుత దర్శకుడిగా, తర్వాత హీరోగా పలు సినిమాలు చేశాడు. అయితే 'కాంతార'తో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నాడు. ఆ చిత్రానికి ప్రీక్వెల్‌తో వచ్చి మరో సక్సెస్ అందుకున్నాడు. రీసెంట్‌గా కుటుంబంతో కలిసి దీపావళి సెలబ్రేట్ చేసుకున్నాడు. అయితే రిషభ్ ఇంట్లో ఏకంగా ఐదు ఖరీదైన కార్లు ఉండటం ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. రిషభ్ భార్య ప్రగతి శెట్టి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోల్లో వీళ్ల ఇల్లు అంతా క్లియర్‌గా చూడొచ్చు. అలానే ఆడీ క్యూ7, మహీంద్రా థార్, టయోటా వెల్ ఫైర్, జీప్ కంపాస్ ట్రైల్‌హాక్ తదితర కార్లు కూడా కనిపించాయి. దీంతో రిషభ్ దగ్గర చాలానే కార్లు ఉన్నాయని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. కార్లతో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్ సెప్టార్ 650 లాంటి కాస్ట్లీ బైక్స్ కూడా రిషభ్ దగ్గర ఉన్నాయట. రిషభ్ తర్వాత సినిమాల విషయానికొస్తే కొన్నాళ్ల పాటు దర్శకత్వం పక్కనబెట్టబోతున్నాడు. త్వరలో ప్రశాంత్ వర్మ తీయబోయే 'జై హనుమాన్' సెట్స్‌లో అడుగుపెడతాడు. ఇది కాకుండా ఛత్రపతి శివాజీ బయోపిక్, తెలుగులో సితార సంస్థలో ఓ పీరియాడిక్ మూవీ చేయబోతున్నాడు. ఈ మూడు పూర్తయ్యేసరికి 2028 అయిపోవచ్చు. తర్వాతే 'కాంతార ఛాప్టర్ 2' ఉండొచ్చేమో చూడాలి?



# రెండు లారీలు తీసుకెళ్లమన్న బన్నీ.. థాంక్స్ చెప్పిన నాగ్

తెలుగు ఇండస్ట్రీలో కొత్త శకానికి నాంది పలికిన సినిమా శివ. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో అక్కినేని నాగార్జున హీరోగా నటించిన ఈ మూవీ ఇండస్ట్రీ హిట్ కొట్టింది. తాజాగా ఈ సినిమా నవంబర్ 14న రీరిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేక వీడియో విడుదల చేశాడు. మన శివ మూవీ రిలీజ్ అయి దాదాపు 36 ఏళ్లవుతోంది. తెలుగు సినీ చరిత్రలోనే కాదు, ఇండియన్ సినిమా చరిత్రలోనూ ఇదొక ఐకానిక్ సినిమాగా నిలిచింది.

**రెండు లారీల పేపర్స్**

ఈ క్లాసిక్ సినిమాను సెలబ్రేట్ చేసుకునే సమయం వచ్చింది. ఈసారి థియేటర్స్‌కు రెండు లారీల పేపర్స్ తీసుకెళ్లండి అని చెప్పుకొచ్చాడు. ఈ వీడియోను నాగార్జున షేర్ చేస్తూ.. డియర్ అల్లు అర్జున్ (Allu Arjun), నీకు రెండు లారీల థాంక్స్ అని ట్వీట్ చేశాడు. కాగా శివ సినిమాలో అమల హీరోయిన్‌గా నటించింది. 1989 అక్టోబర్ 5న రిలీజైన ఈ సినిమాకు అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర నిర్మాతలుగా వ్యవహరించగా ఇళయరాజా సంగీతం అందించారు. ఇది తెలుగులో సెన్సేషన్ హిట్ అవడంతో శివ(1990) పేరుతోనే హిందీలో రీమేక్ చేసి అక్కడ కూడా హిట్ అందుకున్నాడు ఆర్జీవీ.


# భరించలేనంత బాధ..

## కర్నూల్ ఘటనపై రష్మిక ఎమోషనల్




కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశాన్ని కలచి వేసింది. ఈ ఘటన గురించి సినీ నటి రష్మిక మందన్న స్పందించారు. 'కర్నూలులో జరిగిన ఘోర ప్రమాదం నా గుండెను చాలా తీవ్రంగా బాధపెడుతోంది. తగలబడుతున్న బస్సులో కాలిపోయే ముందు ప్రయాణికుల బాధను ఊహిస్తేనే భయంకరంగా ఉంది. చిన్న పిల్లలతో పాటు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఒక కుటుంబం మొత్తం నిమిషాల్లోనే తమ ప్రాణాలు కోల్పోయిందని తెలుసుకుంటే చాలా బాధేస్తుంది. నిజంగా ఈ సంఘటన వినాశకరమైనది. ఇంతటి విషాదాన్ని మిగిల్చిన ఈ ప్రమాదంలో మరణించిన వారికి నా నివాళి. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. మృతుల కుటుంబాలకు నా సానుభూతి.. దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నా'అంటూ సోషల్‌మీడియాలో ఆమె ఒక పోస్ట్ చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయ్యారు. నెల్లూరుకు చెందిన అనూష ఆ మంటల్లో ఎలాగైనా తన కుమార్తెను కాపాడుకోవాలని బిడ్డను కౌగిలించుకుని అలాగే కాలిపోయిన దృశ్యం అందరినీ కంటతడి పెట్టించింది. మృతుల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక వాసులున్నారు. వీరిలో ఇద్దరు చిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఈ ప్రమాద సమయంలో బస్సు అద్దాలను ధ్వంసం చేసి అతి కష్టంగా 25 మంది ప్రాణాలతో బయటపడ్డారు.

# తండ్రి కాబోతున్న దగ్గుబాటి హీరో?



టాలీవుడ్ హీరో రానా తండ్రి కాబోతున్నారు. త్వరలోనే దగ్గుబాటి ఇంట్లోకి వారసుడు/ వారసురాలు రాబోతున్నారు. రానా సతీమణి మిహిక బజాజ్ గర్భం దాల్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని రానా ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఓ మంచి రోజు చూసి ఈ గుడ్ న్యూస్‌ని తన అభిమానులతో పంచుకోవాలని రానా భావిస్తున్నారట. గతంలోనూ మిహికా ప్రెగ్నెంట్ అంటూ నెట్టింట ప్రచారం జరిగింది. ఈ వార్తలను రానా దంపతులిద్దరూ కొట్టిపారేశారు. చాలా కాలం తర్వాత మరోసారి రానా తండ్రి కాబోతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ సారి కూడా పుకారుగానే మిగిలిపోతుందా? లేదా నిజంగానే రానాకి ప్రమోషన్ వచ్చిందా అనేది తెలియాలంటే వాళ్లు స్పందించేవరకు ఆగాల్సిందే. రానా, మిహికాలది ప్రేమ వివాహం. ముంబైలో ఇంటీరియర్ డిజైనర్‌గా పని చేసే మిహీకా స్వస్థలం హైదరాబాద్. చిన్నప్పటి నుంచి ఒకరికొకరు తెలుసు. కానీ లాక్‌డౌన్ సమయంలో వీరిద్దరు ప్రేమలో పడినట్లు ఓ ఇంటర్వ్యూలో రానా చెప్పారు. వీరిద్దరి పెళ్లి 2020 ఆగస్టు 8న జరిగింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కువగా ముంబైలోనే ఉంటుంది. రానా వారసత్వంగా వస్తున్న వ్యాపారాలను చూసుకుంటూనే.. నిర్మాతగా, నటుడిగానూ కొనసాగుతున్నాడు.

# సౌత్ సినిమాలు అందరూ చూస్తున్నారు.. ఆ ఒక్కటే మారాలింకా!



ఇప్పుడంటే దక్షిణాది సినిమాలను దేశమంతా ఎగబడి చూస్తున్నారు కానీ, ఒకప్పుడు ఇక్కడి సినిమాలను పెద్దగా పట్టించుకునేవారు కాదు! ఈ పరిస్థితి మారినందుకు ఆనందంగా ఉందని చెప్తోంది హీరోయిన్ ప్రియమణి. దశాబ్ద కాలంగా పాన్ ఇండియా స్థాయిలో దక్షిణాది సినిమాలు ఆడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసింది.

**అందుకు హ్యాపీ**

ఇండియా టుడేతో ప్రియమణి మాట్లాడుతూ.. జనాలు ఇప్పటికైనా దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు హ్యాపీ. ప్రాంతీయ భాషా చిత్రాలను ఎంతో బాగా ఆదరిస్తున్నారు. అక్కడ ఎప్పటినుంచో మంచి సినిమాలున్నాయి. కానీ, గతంలో వాటికంత ప్రాధాన్యత దక్కకుండా పోయింది. ప్రతి భాషలోనూ అద్భుతమైన సినిమాలు వస్తూనే ఉంటాయి. కాకపోతే వాటి గురించి ఎవరూ మాట్లాడేవారు కాదు. ఇప్పుడలాంటి చిత్రాలు భారీ విజయాలు అందుకోవడం నిజంగా గొప్ప విషయం.

**గీత చెరిగిపోవాలని కోరుకుంటున్నా**

సినిమాలే కాదు, దానికోసం పని చేసిన నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్ల గురించి కూడా చర్చించుకుంటున్నారు. ఇది మంచి పరిణామం. ప్రాంతీయ సినిమాకు, హిందీ సినిమాకు మధ్య ఉన్న అడ్డుగోడలు నెమ్మదిగా తొలగిపోతున్నాయి. ఏదో ఒకరోజు ఆ సరిహద్దులు పూర్తిగా చెరిగిపోవాలని కోరుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ప్రియమణి ద ఫ్యామిలీ మ్యాన్ 3 వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఈ సిరీస్‌లో మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు.

# బిగ్‌బాస్ ఫేమ్ దివ్యపై హిట్ అండ్ రన్ కేసు..



యశవంతపుర: బిగ్‌బాస్ అనగానే వివాదాలు, గొడవలు గుర్తుకువస్తాయి. అదే మాదిరిగా బుల్లితెర నటి, గతంలో బిగ్‌బాస్-8 పోటీదారు దివ్య సురేశ్ హిట్ అండ్ రన్ కేసులో చిక్కుకుంది. బైక్‌ను ఢీకొనడంతో ఓ యువతి కాలు విరిగినట్లు తెలిసింది. దీంతో, ఆమెను విచారించి కారును సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల నాలుగో తేదీ అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో బెంగళూరు బ్యాటరాయనపుర ఎంఎం రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. కిరణ్, అనుషా, అనిత కలిసి బైకులో ఆస్పత్రికి వెళుతున్నారు. కుక్కలు అడ్డురావటంతో భయంతో కిరణ్ బైకును కొద్దిగా కుడివైపు తిప్పాడు. అదే సమయంలో వెనుక వేగంగా వస్తున్న దివ్య సురేశ్ కారు.. వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడ్డారు. అనిత కాలికు దెబ్బ తగిలింది. అయినా కూడా దివ్య కారు ఆపి ఏమైందో తెలుసుకోకుండా అలాగే ఉడాయించింది.

**రూ.2 లక్షలు ఖర్చయింది**

ఈ క్రమంలో కిరణ్ ఏడో తేదీన కారు హిట్ అండ్ రన్‌పై బ్యాటరాయనపుర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం, పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా అది దివ్య సురేశ్ కారుగా గుర్తించారు. దీంతో, ఆమెను విచారించి కారును సీజ్ చేశారు. అనిత కాలు ఫ్రాక్చర్ కావడంతో ఆస్పత్రిలో చేరింది. చికిత్సగానూ రూ. 2లక్షలు ఖర్చయినట్లు, తమకు న్యాయం చేయాలని కిరణ్ ఫిర్యాదులో కోరాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com